12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 327 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా గురువారం 1 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 327 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST THU 1 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




- 93 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన విశాఖ పోర్టులో అసలేం జరుగుతోంది?
- దేశ ఆర్థిక వ్యవస్థకు వాణిజ్య ద్వారం... ఇప్పుడు పరిపాలనా వ్యవస్థపై ప్రశ్నలు
- కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మేజర్ పోర్టా?.. కొందరు అధికారుల 'ప్రైవేట్ సామ్రాజ్యమా?'
- పైస్థాయి పెత్తనం కింద కిందిస్థాయి ఉద్యోగుల గొంతు నలిగిపోతోందా?
- కమర్షియల్ నిర్ణయాల్లో పారదర్శకత ఎంత?.. వ్యక్తిగత ప్రభావం ఎంత?
- బెర్త్ కేటాయింపు నుంచి కార్గో హ్యాండ్లింగ్ వరకు... నిర్ణయాల వెనుక అసలు వ్యవస్థ ఏమిటి?
- ఫైళ్లు తెరిస్తే కనిపించేది పారదర్శకతా?.. మరో కథా?

**'పెన్ పవర్' గ్రాండ్ రిపోర్ట్ - - ఎపిసోడ్-1**

వివరాలు 2లో..

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- 120 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 26,401 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



**పెన్ పవర్ డెస్క్:**తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్

- మిగతా 2లో

## రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!

### భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక



- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ

- మిగతా 2లో



## విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు

**పెన్ పవర్ డెస్క్:** ఫ్లైదుబాయ్ విమానంలోని ఓ పైలట్.. తోటి పైలట్‌ను కత్తితో పొడిచి, విమానాన్ని కూల్చివేసేందుకు యత్నిం చాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ప్రయాణికులు, సిబ్బంది కలిసి అతడిని కట్టడి చేసి.. పెను ప్రమాదాన్ని నివారించారని తెలిపారు.

- మిగతా 2లో

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- సేవా సంకల్ప యాత్రను ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు
- తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర
- యాత్రలో పాల్గొంటున్న 25 మంది రైడర్లు
- టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహణ
- నాలుగు రాష్ట్రాల మీదుగా ఎనిమిది రోజుల ప్రయాణం

- మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను



## 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'.. జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు



- వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు
- కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు
- రూ.40 కోట్ల సుపారీ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి
- ఈడీ అటాచ్‌మెంట్‌ను ప్రస్తావించిన నిమ్మల
- అజయ్ కల్లాం వాంగ్మూలాన్ని గుర్తుచేసిన మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

- మిగతా 2లో



## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### లోకేశ్.. తీసుకున్న నిర్ణయంతో ఎమ్మెల్యేలు డమ్మీలుగా మారిపోయారా?

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ సీరియస్ గా తీసుకుంది. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికయిన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో నారా లోకేశ్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నారా లోకేశ్ ఇప్పటికే ఎమ్మెల్యేలందరికీ స్పష్టమైన ఆదేశాలు అందచేశారు. విజయం మన వైపే ఉండాలని చెప్పారు. అలాగే అభ్యర్థుల ఎంపికలోనూ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వకుండా కేంద్ర పార్టీ కార్యాలయమే బాధ్యతలను తీసుకోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయంశమైంది. ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన వారిని ఎంపిక చేస్తారన్న అనుమానం లోకేశ్ కు వచ్చినట్లుంది. అలాగయితే పార్టీ కోసం కష్టపడుతూ, జెండా పట్టుకున్న వారికి అన్యాయం జరుగుతుందని భావించి లోకేశ్ ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరైనా వారిని గెలిపించుకుని రావాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనే పెట్టి లోకేశ్ వారికి పెద్ద బాధ్యతలను అప్పగించారు.

**పార్టీ కార్యాలయంలోనే...**

అభ్యర్థుల ఎంపికపై మంత్రి నారా లోకేశ్ పార్టీ కార్యాలయాల వేదికగా పారదర్శకమైన కసరత్తు నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పార్టీ కేంద్ర కార్యాలయానికి మేయర్, ఛైర్మన్ల పేర్లను మూడింటిని పంపాలని, ప్రాధాన్యత క్రమంలో పంపాలని కోరారు. అలాగే కౌన్సిలర్ పేర్లను కూడా పంపాలని తెలిపారు. ప్రతి కౌన్సిలర్, మేయర్ , ఛైర్మన్ స్థానిక స్థానానికి ముగ్గురు సమర్థులైన అభ్యర్థుల పేర్లను పరిశీలన కోసం తెలపాలని సూచించారు.అభ్యర్థుల ఎంపికలో వారి రాజకీయ నేపథ్యం, పార్టీ కోసం వారు చేసిన సేవలు, క్షేత్రస్థాయిలో ప్రజాబలం మరియు నిజాయితీకి పెద్దపీట వేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కేవలం వ్యక్తిగత సిఫార్సులకే పరిమితం చేయకుండా, పార్టీ కార్యాలయాల స్థాయిలో అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగదని లోకేశ్ భావిస్తున్నారు.

**ఎమ్మెల్యేలు నిర్ణయించిన వారే...**

అయితే అభ్యర్థులను గెలిపించుకోవాలంటే ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన వారిని పోటీకి దింపి అవసరమైతే వారికి ఆర్థిక సాయాన్ని కూడా అందచేస్తారు. ఇలా పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేస్తే ఎమ్మెల్యేలు ప్రచారానికే పరిమితమవుతారమోనన్న అనుమానం కూడా పార్టీ నాయకత్వంలో ఉంది. తమకు అనుకూలురైన వారైతే వచ్చే సాధారణ ఎన్నికల్లో తమకు కష్టపడి పనిచేస్తారని, అదే పార్టీ కేంద్ర నాయకత్వం ఎంపిక చేసిన వారయితే తమను ఎదిరించే అవకాశాలుంటాయన్న భావన కూడా ఎమ్మెల్యేల్లో ఉంది. ఎప్పుడైనా స్థానిక సంస్థలకు అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతుంది. కానీ నారా లోకేశ్ నేడు ఆ పద్ధతిని పూర్తిగా మార్చేశారు. అయితే ఇది కూటమి అభ్యర్థుల ఎంపిక విజయానికి దోహదపడుతుందా? లేక ఇబ్బందులు ఎదురవుతాయా? అన్న ప్రశ్నలు కూడా లేవనెత్తుతున్నాయి. అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, వాయిదా పడతాయనే తప్పుడు ప్రచారాలను నమ్మకుండా నాయకులు, శ్రేణులు పూర్తిస్థాపనతో సిద్ధంగా ఉండాలని నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. మొత్తం మీద నారా లోకేశ్ నిర్ణయంతో ఎమ్మెల్యేలు తాము డమ్మీలమయ్యామన్న భావనలో ఉన్నారు.

### రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!

## భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది.తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది.అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

# నాడు విశాఖకు ‘మణిహారం’... నేడు ప్రశ్నల సుడిగుండం!

ఇన్వెస్టిగేషన్ టీమ్, పెన్ పవర్ విశాఖపట్నం, సెప్టెంబర్ 30

ఒకప్పుడు చిన్న సముద్ర రేవు... కాలక్రమంలో దేశ వాణిజ్యానికి కీలక ద్వారం...విశాఖ నగర అభివృద్ధితో విడదీయలేని బంధం... వేలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారం... అదే విశాఖపట్నం పోర్టు. 1933లో ప్రారంభమైన ఈ ఓడరేవు ప్రయాణం తొమ్మిది దశాబ్దాలు దాటింది. నౌకలు వచ్చాయి... సరకు దిగింది... పరిశ్రమలు పెరిగాయి... ఉపాధి విస్తరించింది... విశాఖ నగర ఆర్థిక స్వరూపమే మారిపోయింది. ఇనుప ఖనిజం నుంచి బొగ్గు వరకు... ముడి చమురు నుంచి పెట్రోలియం ఉత్పత్తుల వరకు... ఎరువుల నుంచి ఇతర భారీ సరకు వరకు... సముద్రం నుంచి దేశ పారిశ్రామిక వ్యవస్థకు సరకు చేరే ప్రధాన ద్వారాల్లో విశాఖ పోర్టు తనదైన స్థానం సంపాదించుకుంది. అందుకే విశాఖకు పోర్టు అంటే కేవలం ఓడలు వచ్చిపోయే ప్రదేశం కాదు. అది ఉపాధి... అది వాణిజ్యం...అది పరిశ్రమ... అది నగర ఆర్థిక జీవనాడిలో ఒక భాగం.

**కానీ...**

ఇంతటి చరిత్ర కలిగిన సంస్థలో పరిపాలన, కమర్షియల్ నిర్ణయాలు, ఉద్యోగ వ్యవస్థపై ఇప్పుడు కొన్ని తీవ్రమైన ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆ ప్రశ్నలకు సమాధానం వ్యక్తుల మాటల్లో కాదు. రికార్డుల్లో కనిపించాలి. అసలు పోర్టు ఎవరిది?..ముందుగా ఒక విషయం స్పష్టం... విశాఖపట్నం పోర్టు ఏ వ్యక్తికో, ఏ అధికారికో చెందిన ప్రైవేట్ సంస్థ కాదు... ఇది కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలోని మేజర్ పోర్ట్ అథారిటీ... మరి అలాంటి సంస్థలో... వ్యవస్థ కంటే వ్యక్తులు బలంగా మారుతున్నారన్న ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నాయి? అధికారిక నిర్ణయాలు నిర్దేశిత విధానంలోనే జరుగుతున్నాయా? లేక కొందరు అధికారుల విచక్షణకు అసాధారణ ప్రాధాన్యం ఏర్పడిందా? ఫైల్‌లో ఉన్న నిబంధనే తుది మాటా? లేక ఫైల్ పట్టుకున్న వ్యక్తే తుది మాటగా మారుతున్నారా?

**ఇదే ‘పెన్ పవర్’ పరిశీలనలో మొదటి ప్రశ్న.**

రూల్ బుక్ నడుస్తోందా? వ్యక్తుల మాట నడుస్తోందా? ప్రభుత్వ వ్యవస్థలో ప్రతి నిర్ణయానికీ ఒక ప్రక్రియ ఉండాలి. ఎవరు ప్రతిపాదించారు? ఎవరు పరిశీలించారు? ఎవరు సిఫారసు చేశారు? ఎవరు ఆమోదించారు? ఏ నిబంధన కింద ఆమోదించారు? ఆ నిర్ణయానికి సంబంధించిన రికార్డు ఎక్కడుంది? ఇవన్నీ సమాధానం చెప్పగలిగితేనే పరిపాలనపై నమ్మకం నిలుస్తుంది. అందుకే విశాఖ పోర్టులో కమర్షియల్ వ్యవహారాలకు సంబంధించిన నిర్ణయాలను కూడా ఇదే కొలమానంతో చూడాల్సి ఉంది. ఒకే రకమైన వ్యవహారంలో అన్ని కంపెనీలకూ ఒకే విధానం అమలవుతోందా? ఫైళ్ల పరిష్కారంలో అనవసర ఆలస్యాలు ఉన్నాయా? ఉంటే వాటికి రికార్డుల్లో కారణాలు నమోదు చేస్తున్నారా? ఎవరి సిఫారసుతో ఏ నిర్ణయం తీసుకున్నారన్నది స్పష్టంగా కనిపిస్తుందా? ఇవి ఆరోపణలు కావు. పారదర్శక పరిపాలనలో సమాధానం ఉండాల్సిన ప్రశ్నలు.

**కిందిస్థాయి ఉద్యోగుల గొంతు ఎక్కడ?**

పోర్టు అంటే కేవలం చైర్‌పర్సన్ కార్యాలయం కాదు. కేవలం ఉన్నతాధికారుల ఏసీ గదులు కాదు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగి నుంచి కార్యాలయంలో ఫైల్ నిర్వహించే సిబ్బంది వరకు --- వేల చేతుల సమిష్టి శ్రమతోనే వ్యవస్థ ముందుకు సాగుతుంది. అయితే... కిందిస్థాయి ఉద్యోగి పైఅధికారి నిర్ణయాన్ని ప్రశ్నించగలడా? నిబంధనలకు విరుద్ధంగా ఉందని భావించిన అంశంపై అభ్యంతరం నమోదు చేయగలడా? లేక ప్రశ్నిస్తే బదిలీ, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురవుతాయన్న భయం ఉందా? కొంతమంది ఉద్యోగుల నుంచి వినిపిస్తున్న ‘బాసిజం’, ఒత్తిళ్ల ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఇక్కడ కూడా మాటలు కాదు... ఫిర్యాదులు, విజిలెన్స్ రికార్డులు, పరిపాలనా ఉత్తర్వులు, బదిలీ పత్రాలు, శాఖాపరమైన రికార్డులే నిజాన్ని తేల్చాలి.

**కమర్షియల్ విభాగం... అసలు కథ ఇక్కడే మొదలవుతోందా?**

ఒక భారీ కార్గో నౌక విశాఖ సముద్ర జలాల్లోకి వస్తోంది అనుకుందాం. అది పోర్టుకు రావడానికి ముందే ఒక పరిపాలనా ప్రక్రియ మొదలవుతుంది. నౌక వివరాలు... కార్గో వివరాలు...బెర్త్ లభ్యత...హ్యాండ్లింగ్ ఏర్పాట్లు... షిప్పింగ్ ఏజెంట్ వ్యవహారాలు... కమర్షియల్ అంశాలు... ఇలా అనేక స్థాయిల్లో నిర్ణయాలు ఉంటాయి.

**మరి ఈ నిర్ణయాల గొలుసులో ఎవరి పాత్ర ఎంత?**

అక్కడే అసలు కథ ఉంది. ఒక ఫైలు ఎక్కడ మొదలవుతోంది? ఎన్ని టేబుళ్లు దాటుతోంది? ఎవరు వ్యాఖ్యలు రాస్తున్నారు? ఎవరు సిఫారసు చేస్తున్నారు? చివరకు నిర్ణయం ఎవరు తీసుకుంటున్నారు? అధికారికంగా ఒకరికి ఉన్న అధికారం ఎంత? ఆచరణలో వారి ప్రభావం ఎంత? ఈ రెండింటి మధ్య వ్యత్యాసం ఉందా?

బెర్త్ కేటాయింపు... ఎవరి నిర్ణయం?

పోర్టులో బెర్త్ అంటే వ్యాపారపరంగా అత్యంత కీలకమైన అంశం. నౌక వేచి ఉండే ప్రతి గంటకూ ఆర్థిక విలువ ఉంటుంది. అందువల్ల బెర్త్ కేటాయింపులో పారదర్శకత అత్యంత కీలకం. ఏ నౌకకు ఎప్పుడు బెర్త్ ఇచ్చారు? దానికి ముందు ఎన్ని నౌకలు వేచి ఉన్నాయి? ప్రాధాన్యత నిర్ణయించడానికి ఉపయోగించిన ప్రమాణాలేమిటి?ఏదైనా నౌకకు ప్రాధాన్యత ఇచ్చినట్లయితే దానికి రికార్డుల్లో కారణముందా? ఈ వివరాలను తేదీలు, సమయాలు, నౌకల వారీగా పరిశీలిస్తే చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

**కంపెనీ మారితే నిబంధన మారుతుందా?**

ఇది మరో కీలకమైన ప్రశ్న. ఒకే తరహా కార్గో... ఒకే తరహా పరిస్థితులు... వేర్వేరు కంపెనీలు. అప్పుడు నిర్ణయాలు కూడా ఒకే విధంగా ఉంటున్నాయా? లేక ఒక కంపెనీ ఫైలు వేగంగా కదిలి మరో కంపెనీ ఫైలు ఆలస్యమవుతోందా? అలా జరిగితే కారణం ఏమిటి? సాంకేతిక సమస్యా? పత్రాల లోపమా? బెర్త్ అందుబాటులో లేకపోవడమా? లేక మరేదైనా కారణమా? ఫైల్ నోటింగ్స్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలవు.

**‘ప్రైవేట్ సామ్రాజ్యం’ అన్న ఆరోపణ ఎందుకు?**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఒక మేజర్ పోర్టును “కొంతమంది అధికారుల ప్రైవేట్ సామ్రాజ్యం”గా అభివర్ణించడం చాలా తీవ్రమైన ఆరోపణ. అందుకే దానిని నినాదంగా వదిలేయడం కాదు... పరీక్షించాలి. ఒక అధికారి తనకు చట్టబద్ధంగా ఉన్న అధికార పరిధిలోనే పనిచేస్తున్నారా? లేక అధికార పరిధిని మించి నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నారా? ఒక వ్యక్తి లేకుండా ఫైలు ముందుకు కదలదన్న పరిస్థితి నిజంగా ఉందా? అలా ఉంటే దానికి రికార్డు ఆధారం ఏమిటి? లేక ఇవన్నీ అసంతృప్తితో వస్తున్న ఆరోపణలేనా? రెండు అవకాశాలనూ సమానంగా రికార్డుల ముందు నిలబెట్టాల్సిందే.

**విజిలెన్స్ ఏం చెబుతోంది?**

ఇంతటి ప్రశ్నలు వినిపిస్తున్నప్పుడు మరో కీలక అంశం విజిలెన్స్. కమర్షియల్ వ్యవహారాలపై గతంలో ఫిర్యాదులు వచ్చాయా? ఏ అధికారిపైనైనా లిఖితపూర్వక ఫిర్యాదులు నమోదయ్యాయా? వాటిపై ప్రాథమిక పరిశీలన జరిగిందా? ముగిసిన ఫిర్యాదుల ఫలితం ఏమిటి? పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? ఫిర్యాదులు లేకపోతే --- ఆరోపణలకు మూలం ఏమిటి? ఇవన్నీ తెలుసుకోవాల్సిన అంశాలే.

పెన్ పవర్ ఎవరికీ ముందే తీర్పు ఇవ్వడం లేదు, ఈ కథనంలో అత్యంత ముఖ్యమైన అంశం ఇదే. ఏ అధికారినీ ముందుగానే దోషిగా ప్రకటించడం ‘పెన్ పవర్’ లక్ష్యం కాదు. అదే సమయంలో ఒక ప్రభుత్వ సంస్థలో పరిపాలన, కమర్షియల్ నిర్ణయాలు, ఉద్యోగులపై ఒత్తిళ్లు లేదా వ్యక్తిగత ప్రభావం గురించి ప్రశ్నలు తలెత్తినప్పుడు వాటిని పట్టించుకోకుండా వదిలేయడం కూడా జర్నలిజం కాదు. ఆరోపణ వస్తే ప్రశ్నిస్తాం. సమాధానం కోరుతాం. రికార్డు వెతుకుతాం. రెండు వైపుల వాదన తీసుకుంటాం. ఆ తర్వాత వాస్తవాన్ని పాఠకుడి ముందుంచుతాం.

**అదే ఈ గ్రౌండ్ రిపోర్ట్ ఉద్దేశం.**

93 ఏళ్ల ప్రతిష్ఠ...ఒక్కరి సొత్తు కాదు! విశాఖ పోర్టు ప్రతిష్ఠ ఏ ఒక్క అధికారి కంటే పెద్దది. ఏ ఒక్క విభాగం కంటే పెద్దది. ఏ ఒక్క షిప్పింగ్ కంపెనీ కంటే పెద్దది. ఎందుకంటే ఇది ప్రజా వ్యవస్థ. దేశ వాణిజ్య ప్రయోజనాలతో ముడిపడిన సంస్థ. అందుకే ఆరోపణలు అవాస్తవమైతే వాటిని రికార్డులతో ఖండించాలి. నిజమైతే బాధ్యులపై చర్య తీసుకోవాలి. కానీ... మౌనం మాత్రం సమాధానం కాదు.

‘పెన్ పవర్’ అడుగుతున్న ప్రశ్నలు

విశాఖ పోర్టులో వ్యవస్థ బలంగా ఉందా?.. వ్యక్తులు బలంగా ఉన్నారా? రూల్ బుక్ నడుస్తోందా?.. కొందరి మాటే రూల్‌గా మారుతోందా? కమర్షియల్ నిర్ణయాల్లో అందరికీ సమాన అవకాశముందా? బెర్త్ కేటాయింపులో ప్రతి నిర్ణయానికీ రికార్డు ఆధారం ఉందా? కిందిస్థాయి ఉద్యోగులు స్వేచ్ఛగా తమ అభిప్రాయం చెప్పగలుగుతున్నారా?విజిలెన్స్‌కు అందిన ఫిర్యాదులు ఏమయ్యాయి? కమర్షియల్ ఫైళ్లను బయటపెడితే కనిపించేది పారదర్శకతా?.. లేక ఇప్పటివరకు బయటకు రాని మరో కథా? సమాధానాలు ఊహల్లో వద్దు. రికార్డుల్లో కావాలి.

**అందుకే... మొదలైంది ‘పెన్ పవర్’ గ్రౌండ్ రిపోర్ట్!**

**ఎపిసోడ్--2లో...**

**“కమర్షియల్‌లో ఎవరి మాట నడుస్తోంది?”**

**నౌక రాక నుంచి బెర్త్ కేటాయింపు వరకు...**

**కార్గో హ్యాండ్లింగ్ నుంచి కమర్షియల్ నిర్ణయాల వరకు...**

**ఫైలు ఎవరి టేబుల్‌పైకి వెళ్తుంది?**

**ఎవరు సిఫారసు చేస్తారు?**

**తుది నిర్ణయం ఎవరిది?**

**రికార్డులు ఏం చెబుతున్నాయి?**

**చదువుతూనే ఉండండి పెన్ పవర్ తెలుగు, హిందీ మరియు ఇంగ్లీష్ దిన పత్రికలు**

**ఈ కథనాలపై మీ వద్ద ఆధారాలు/ అభ్యాంతరాలు ఉంటే నేరుగా ఈ నెంబర్ లో కాంటాక్ట్ చేయండి : 9059465965 ,** mail id : editorpenpower@gmail.com

## ‘బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం’.. జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

- మొదటి పేజి తరువాయి

నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు.మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు.

వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు.హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ.40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు.

హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు.దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్‌అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- మొదటి పేజి తరువాయి

ఆయన ప్రారంభించారు. 25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు.తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం

కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- మొదటి పేజి తరువాయి

చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది.భారత్–అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా–యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది.

గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్–అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించినట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేకమని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి, విజయవాడ కార్యక్రమాలతో కలిపి సుమారు 60,000 పట్టాలు పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ.52,000 కోట్లు ఉంటుందని వివరించారు. లబ్ధిదారులు ఈ ఆస్తిని అమ్ముకోవద్దని, భవిష్యత్ కోసం కాపాడుకోవాలని సూచించారు.మహిళల కోసం ‘స్త్రీ శక్తి’ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి వాటిలోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు

- మొదటి పేజి తరువాయి

అసమాన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ప్రదర్శించి.. ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన పైలట్‌ను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారని వెల్లడించారు. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్‌పై కో–పైలట్ కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.

# ఎస్సీ, ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు





**మాన్యువల్ స్కావెంజింగ్ జరగకుండా విస్తృత అవగాహన కల్పించాలి**
**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 30:** జిల్లాలో ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు,అత్యాచార కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం, పరిహారం,పునరావాసం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ ప్రియ, ఇతర అధికారులు, కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 29 వరకు జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల స్థితిగతులు, బాధితులకు పరిహారం పంపిణీ, పునరావాసం,కేసుల దర్యాప్తు పురోగతి, చార్జిషీట్ దాఖలు, కోర్టు కేసుల పరిస్థితి, మాన్యువల్ స్కావెంజింగ్ నివారణ, పారిశుద్ధ్య కార్మికుల పునరావాసం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

**బాధితులకు సత్వర న్యాయం**

కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. చట్టప్రకారం బాధితులకు అందాల్సిన తక్షణ ఉపశమనం, పరిహారం, పునరావాస సహాయాన్ని సకాలంలో అందించాలని ఆదేశించారు.2026లో ఇప్పటివరకు జిల్లాలో ఈ చట్టం కింద 21 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆయా కేసుల్లో పరిహారం పంపిణీ, పునరావాసం, దర్యాప్తు పురోగతి, చార్జిషీట్ దాఖలు, కోర్టు కేసుల పరిస్థితిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పోలీస్, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అత్యాచార కేసుల్లో బాధితులు, సాక్షులకు చట్టపరంగా కల్పించాల్సిన హక్కులు, రక్షణ, న్యాయ సహాయం అందేలా చూడాలని, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, గృహాలు తదితర మౌలిక వసతుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కుల ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి అవకాశాలు అర్హులకు సకాలంలో అందేలా చూడాలని, రాజ్యాంగ రిజర్వేషన్ల ప్రయోజనాలు వారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.అన్ని మండలాల్లో క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి నెల మొదటి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు పోలీస్, రెవెన్యూ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**మాన్యువల్ స్కావెంజింగ్‌కు అడ్డుకట్ట**

జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, రైల్వే స్టేషన్ల పరిధిలో మాన్యువల్ స్కావెంజింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సెప్టిక్ ట్యాంకులు, డ్రైనేజీలను శుభ్రపరిచే సమయంలో కార్మికులు నేరుగా లోపలికి దిగకుండా తగిన రక్షణ పరికరాలు, పీపీఈ కిట్లు తప్పనిసరిగా అందించాలని సూచించారు.బహిర్భూమికి వెళ్లే పరిస్థితులు ఎక్కడా లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలపై ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పారిశుద్ధ్య కార్మికులకు చట్టపరంగా అందాల్సిన కనీస వేతనాలు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య బీమా, నివాస వసతులు కల్పించాలని సూచించారు. వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేలా, తదుపరి తరాలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత అధికారులు తదుపరి సమావేశం నాటికి చర్యల నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ఎం. కిషోర్ కుమార్, డీఎంహెచ్‌వో డా. కె. అనిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మురళీకృష్ణంరాజును పరామర్శించిన,పిల్లి సుభాష్ చంద్రబోస్, కొయ్యే మోషేను రాజు పలువురు నాయకులు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 30:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజును ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను, రాజు, రాజ్యసభ సభ్యులు, పీఏసీ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అంగూరి శివకుమారి ,మాకినీడి శేషు కుమారి, భీమవరం ఇన్చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఏ ఎస్ రాజు, తోపాటు బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. ముదునూరి మురళికృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల స్వర్గస్తులైనారు.విషయం తెలుసుకున్న మోషేను రాజు, పిల్లి సుభాష్ చంద్రబోస్ తదితరులు వారి కుమారులు సీతారామరాజు, మురళీ కృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రామరాజు చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించడమే కాకుండా, వారి కుటుంబానికి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. కృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో తాడేపల్లిగూడెం వైసిపి ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు,ప్రముఖ కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు,ఏపూరి శ్రీనివాస రావు,జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు,మాజీ,జడ్పీటీసీలు, ఎంపీటీసీలు,ఎంపీపీలు, మాజీ సర్పంచులు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి.
## -ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పిలుపు.



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,30:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలోని సీతారామ కాలేజీ వద్ద అక్టోబర్ 1 న నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 16 ప్రముఖ కంపెనీలు పాల్గొనడంతో పాటు 700 కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. వివిధ విద్యార్హతలు, నైపుణ్యాలు కలిగిన యువత ఈ జాబ్ మేళాకు హాజరై తమకు అనుకూలమైన ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆమె కోరారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇటువంటి మెగా జాబ్ మేళాలు ఎంతో ఉపయోగకరమని, యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాన్ని సాధించేందుకు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని వరుపుల సత్యప్రభరాజా పిలుపునిచ్చారు.

## కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**-కరపత్రాల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం.**

**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,30:** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా రూపొందించిన ప్రత్యేక కరపత్రాలను కిర్లంపూడిలో బుధవారం కూటమి నాయకులు విడుదల చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన అవసరంపై చర్చించారు. ఈ సందర్భంగా ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్, కూటమి పరిశీలకుడు బస్వా వీరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు చేరవేయాలన్నారు.

జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా వాటిపై అవగాహన కల్పించాలని, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని నాయకులు పేర్కొన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోట గాంధీ, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చిన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు చదరం చంటిబాబు, టీడీపీ నాయకులు గంధం ఈశ్వరరావు, తూము కుమార్, కాళ్ల వెంకటేష్, ఆళ్ల బాబులు, నీటి సంఘం అధ్యక్షుడు తూము శ్రీరామమూర్తి, శరకణం వీరబాబు, టౌన్ ప్రెసిడెంట్ మద్దాల మణికంఠస్వామి, సరిసే శివ, పెంటకోట శివ, యడ్ల కృష్ణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గంధం ప్రభాకర్, కల్కి భగవాన్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శరకణం రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం గ్రామంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 30:** ప్రత్తిపాడు మండలం మండలం ధర్మవరం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వద్ద న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ శారదామణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు వచ్చినా స్కూలు వద్ద టీచర్స్ కి ఇంటి వద్ద తల్లిదండ్రులకు తెలియపరచాలన్నారు గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి తెలియజేశారు.విద్యార్థులు భావి భారతదేశాన్ని తీర్చిదిద్దే మంచి పౌరులుగా ఎదగాలని ఉపాధ్యాయుల యొక్క సలహాలు సూచనలు తీసుకుని భవిష్యత్తులో మంచి స్థానాల్లో ఉదయాలని ఆశీర్వదించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలుగు నష్టాల గురించి, లోక్ అదాలత్ వినియోగాల గురించి తెలియజేశారు.ఇంటి వద్ద తల్లిదండ్రులకు తెలియపరచి చుట్టుపక్కల ఎవరికైనా న్యాయ సలహాలు న్యాయ సేవలు అవసరమైనచో వారిని న్యాయ సేవాధికార సంస్థకు పంపించవలసిందిగా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ శివన్నారాయణ, స్కూల్ స్టాఫ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పిఠాపురం గ్రామాల్లో మౌలిక వసతులు







**ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం**

**పిఠాపురం/కాకినాడ సెప్టెంబర్ 30 పెన్ పవర్:** పిఠాపురం నియోజకవర్గంలోని గ్రామాలు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో పంట పొలాలు, నివాస ప్రాంతాలు ముంపునకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పాడా పీడీ డాక్టర్ ఎన్.వీ. శివరాం ప్రసాద్, మున్సిపల్ అధికారులతో కలిసి పిఠాపురం ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. తొలుత పిఠాపురం పాదగయ సమీపంలోని సామర్లకోట వెళ్లే రహదారి పక్కన ఉన్న బ్రాహ్మణ కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో తాగునీటి పైపులైన్, సీసీ రోడ్డు, మురుగు కాలువ, ట్రాన్స్‌ఫార్మర్ వంటి మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామంలోని సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పారిశుద్ధ్య నిర్వహణ, తడి-పొడి చెత్త సేకరణ, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, మురుగు కాలువల్లో పూడికతీత, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు.ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామస్థాయిలో తాగునీరు, పారిశుద్ధ్య వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

**ముంపు ప్రాంతాల్లో పంట పొలాల పరిశీలన**

అనంతరం పి.రాయవరం, గొల్లప్రోలు మండలం ఏ.కె.మల్లవరం గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను కలెక్టర్ పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాలు ముంపునకు గురికావడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో పంట నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించారు.

**పాడా కార్యాలయంలో సమీక్ష**

పర్యటన ముగింపులో పిఠాపురం పాడా కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల పిఠాపురం పర్యటన సందర్భంగా ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో పాడా అదనపు పీడీ వసంత మాధవి, మున్సిపల్ కమిషనర్ ఎస్.టీ.వీ. రాజేశ్వరరావు, ఎంపీడీవో కృష్ణవేణి, ఏడీఏ స్వాతి, గొల్లప్రోలు తహసీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాపవరంలో స్వచ్ఛమైన తాగునీటికి భరోసా

రూ.3 లక్షలతో ఆర్వో ప్లాంట్ ప్రారంభం





**రామచంద్రపురం రూరల్, పెన్ పవర్,సెప్టెంబర్ 30 :**గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ మరో ప్రజోపయోగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం రూరల్ మండలం కాపవరం గ్రామంలో ఫౌండేషన్ రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో తాగునీటి ప్లాంట్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రారంభించారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణతో కలిసి మంత్రి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన తాగునీరు అందించడం ఎంతో అవసరమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి కాపవరంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండటం వల్ల నీటి ద్వారా వచ్చే అనారోగ్య సమస్యలను తగ్గించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా జాబ్ మేళాలు నిర్వహించడం, పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించడం, వైద్య సేవలు, డయాలసిస్ యూనిట్ ఏర్పాటు, ఫిజియోథెరపీ పరికరాల పంపిణీ, అత్యవసర వైద్య సహాయం, వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి సదుపాయం వంటి పలు కార్యక్రమాలను ఫౌండేషన్ చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక కుటుంబాలకు సహాయం అందుతోందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యత, సేవా దృక్పథంతో వాసంశెట్టి సత్యం నాయకత్వంలో ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని మంత్రి కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా చేపట్టే ప్రతి సేవా కార్యక్రమం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. కాపవరం గ్రామ ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంను అభినందించారు. గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేలా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకే సాంబశివరావు, నియోజకవర్గ మహిళా నాయకురాలు వయిట్ల గజలక్ష్మి, కూటమి పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో గొల్లపాలెం విద్యార్థినికి బంగారు పతకం



**కాజులూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 30**: మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన 39వ జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు బంగారు పతకం సాధించింది. గ్రాండ్ ఫైనల్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు కేరళపై 4--3 తేడాతో విజయం సాధించి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయాన్ని సాధించిన ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టులో కాజులూరు మండలం గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాకరపల్లి లోకేశ్వరి దీపిక ప్రతిభ కనబరిచి జట్టు విజయానికి తన వంతు సహకారం అందించింది. జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎస్.ఎస్.బి.సుశీలా మణి మాట్లాడుతూ.. లోకేశ్వరి దీపిక జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గొల్లపాలెం గ్రామానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల స్థాయిలో ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు సరైన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. లోకేశ్వరి దీపికకు శిక్షణ అందించిన పీడీ జి. సునీల్ కుమార్, వి.ఇమ్మానేయల్ రాజులను కూడా పలువురు అభినందించారు. విద్యార్థిని దీపికను, శిక్షకులను స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో జె. రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బండి శేషగిరి,సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, శలపాక నీటి సంఘం అధ్యక్షులు (టిఎంఆర్) తాడి మాచారెడ్డి,చుండ్రు వీర్రాజు చౌదరి, తోట కృష్ణ,దేగల నాగేంద్ర, దేగల సతీష్, పలివెల రాజు,అంగర శ్రీను, దీవెన మెడికల్స్ వెంకన్న బాబు,నక్క శ్రీను,మాత నాగరాజు,బుంగ నాగేశ్వరరావు,బిరుదా సత్యనారాయణ మూర్తి, ముర్రే శివశంకర్ తదితరులు అభినందించారు. క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో తమ సత్తా చాటగలరని లోకేశ్వరి దీపిక విజయం మరోసారి చాటిచెప్పింది.

## ముంపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలి




జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 30 :**ముంపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పంట కాలువలు, డ్రైనేజీలపై ఆక్రమణలను నిబంధనల మేరకు గుర్తించి వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వాచ్‌డాగ్ పర్యవేక్షణ కమిటీ సభ్యులను ఆదేశించారు. కాలువల్లో పూడిక, చెత్త తొలగింపుతో పాటు ముంపు నీరు సులభంగా వెళ్లేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు.
బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఏలేరు, గోదావరి ఈస్ట్రన్, ఇరిగేషన్ డివిజన్లతో పాటు జిల్లా డ్రైనేజీ డివిజన్ ఇంజనీర్లు, పంచాయతీ అధికారులతో వాచ్‌డాగ్ పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ నెలలో రోజు విడిచి రోజు మూడు ఇరిగేషన్ డివిజన్ల పరిధిలో విస్తృతంగా పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనల ద్వారా ముంపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను క్షేత్రస్థాయిలో గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్టోబర్ నెలాఖరు నాటికి వరి పంటలు కోతకు వచ్చే అవకాశం ఉన్నందున, ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి కాలువలు, డ్రైనేజీల పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. ముంపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుని రైతులకు పంట నష్టం కలగకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లోని ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అన్నవరం, తాళ్లరేవు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు అవసరమైతే డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బలగాలను వినియోగించి ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని సూచించారు. అయితే రెవెన్యూ, పంచాయతీరాజ్,మున్సిపల్, ఇరిగేషన్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం సంబంధిత వారికి నోటీసులు జారీ చేసిన అనంతరమే ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపుతో పాటు పంట కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఒకసారి ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు ఏర్పడకుండా వాచ్‌డాగ్ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. డ్రైనేజీ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఆక్రమణల వివరాలు, తొలగింపునకు తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్, పెద్దాపురం ఆర్డీఓ జి. కృష్ణమూర్తి,స్థానిక ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి చైనులు,ఏలేరు డివిజన్ ఇరిగేషన్ ఈఈ జి. శేషగిరిరావు,ఈస్ట్రన్ డివిజన్ ఈఈ వి.వి.రామకృష్ణ, జిల్లా డ్రైనేజీ డివిజన్ ఈఈ ఎన్.వి.వి.కిషోర్,పంచాయతీ అధికారులు,డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## దేవి నవరాత్రులకు భారీ ఏర్పాట్లు



**పెన్ పవర్ ప్రతినిధి కాకినాడ (పెద్దాపురం) సెప్టెంబర్ ,30** పెద్దాపురంలోని భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పీఠంలో పలు విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పిఠాధి పతి చింతా గోపి శర్మ తెలిపారు.
మహోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 1వ తేదీ గురువారం ఉదయం 9.45 గంటలకు రా ట ముహూర్తం కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీ వేముల సత్యప్రసాద్, శ్రీమతి అరుణ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే అక్టోబర్ 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి గ్రామోత్సవం (ఊరేగింపు) నిర్వహించనున్నారు. ధన సహాయ సహకారం అందిస్తున్న దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని భువనేశ్వరి పీఠం వారు కోరారు.
భువనేశ్వరిపురంలో నవరాత్రి అలంకరణలుపెద్దాపురం, సెప్టెంబర్ 30: భువనేశ్వరిపురంలోని శ్రీ భువనేశ్వరి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజూ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్ 11న లిశ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణ (మొదటి రోజు)లితో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 12న శ్రీ గాయత్రీ దేవి, 13న శ్రీ అన్నపూర్ణా దేవి, 14న శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి, 15న శ్రీ మహాచండీ దేవి, 16న శ్రీ సరస్వతి దేవి, 17న శ్రీ మహాలక్ష్మి దేవి, 18న శ్రీ దుర్గా దేవి, 19న శ్రీ మహిషాసురమర్దిని దేవి, 20న శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అమ్మవారి అలంకరణలను భక్తులు దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఉత్సవాల ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు.

## పైలా రమణ ఏకగ్రీవ ఎన్నిక

**గండేపల్లి ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు**



**గండేపల్లి ,పెన్ పవర్, సెప్టెంబర్ 30:** గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా పైలా రమణ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికల్లో సభ్యులంతా ఏకాభిప్రాయంతో రమణను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. పాఠశాల అభివృద్ధికి గతంలో పైలా రమణ అందించిన సేవలను గుర్తించి మరోసారి చైర్మన్‌గా అవకాశం కల్పించినట్లు తెలిపారు. చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రమణను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పూలమాలలు వేసి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా పైలా రమణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి చైర్మన్‌గా ఎన్నుకున్న విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మాదిరిగానే పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తానని చెప్పారు. ప్రభుత్వ విద్యా పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటూ గండేపల్లి ఉన్నత పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు వర్మీ కంపోస్ట్‌పై శిక్షణ



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** గ్రామాల్లో తడి, పొడి చెత్తను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేసే విధానంపై గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గండేపల్లి గ్రామంలోని ఎస్ డబ్ల్యు పిసి షెడ్ వద్ద బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు వర్మీ కంపోస్ట్ తయారీపై ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారు. కార్యక్రమానికి గండేపల్లి ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి హాజరై తడి, పొడి చెత్తను బిన్--బ్యాగ్ విధానంలో సేకరించే పద్ధతులు, చెత్తను వేరు చేయడం, వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై సమగ్ర అవగాహన కల్పించారు.
గ్రామాల్లో చెత్తను సక్రమంగా సేకరించి, తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా మార్చడం ద్వారా పరిశుభ్రతతో పాటు సేంద్రియ ఎరువు తయారీకి అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. శిక్షణలో భాగంగా వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పించారు.
ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో శిరీష, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరంలో ప్రగతి యూనివర్సిటీ విద్యార్థుల సేవాభావం




**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 30:**గండేపల్లి మండలం ప్రగతి యూనివర్సిటీ సామాజిక బాధ్యత, మానవతా విలువలను చాటుతూ ప్రగతి యూనివర్సిటీ విద్యార్థులు మెగా రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి అండగా నిలవడంతో పాటు యువతలో రక్తదానంపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించారు. విశ్వవిద్యాలయ చైర్మన్ డా. పరుచూరి కృష్ణరావు, డైరెక్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎం.వి. హరినాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్ డా. కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా. జి. నరేష్‌ల మార్గదర్శకత్వంలో కార్యక్రమం జరిగింది. వారి ప్రోత్సాహంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమ సమన్వయంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ వై. విజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. స్టూడెంట్ కోఆర్డినేటర్లు టి. కిరణ్ కుమార్, పి. తేజ విష్ణు సాయి విద్యార్థులను సమన్వయం చేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, రక్తదానం కేవలం సామాజిక సేవ మాత్రమే కాకుండా ఆపదలో ఉన్నవారికి ప్రాణాధారంగా నిలిచే మానవతా కార్యక్రమమని పేర్కొన్నారు. యువత మరింత మంది స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, మానవతా దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విశ్వవిద్యాలయ యాజమాన్యం తెలిపింది. శిబిరాన్ని విజయవంతం చేసిన శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులకు, రక్తదానం చేసిన విద్యార్థులకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.
“రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి.”

# ఆదిత్య యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 30:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ స్వభావ స్వచ్ఛత -- సంస్కార స్వచ్ఛత అనే ఇతివృత్తంతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించబడింది. పరిశుభ్రత వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత పై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డా. ఎం. శ్రీనివాస రెడ్డి వాలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో చూపుతున్న అంకితభావం మరియు సేవా స్ఫూర్తి ని అభినందించారు. వాలంటీర్లు ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి ప్రజల్లో అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సమాజ సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన సూచించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమిష్టి భావన మరియు సేవా స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. డి. కిషోర్ విద్యార్థులకు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పారిశుధ్యం మరియు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాధాన్యతను వివరించారు.సూరంపాలెం గ్రామ పరిసరాల్లో ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 153 మంది విద్యార్థులు, సిబ్బంది మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ మరియు పరిసర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో 1పంచాయతీ ఈఓ ఎం. సత్యనారాయణ, గ్రామ పెద్దలు కుంచె రాజా మరియు ఇతర గ్రామ ప్రముఖులు పాల్గొని ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ లను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. బి. రాంబాబు, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డా. ఐ. వి. వీరాంజనేయులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్. గణపతి, డా. ఎ. గౌతమ్ సింగ్ తో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పంచాయతీ అధికారులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా ... సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్కూల్ ఆఫ్ ఫార్మసీ,ఎన్.ఎస్.ఎస్. యూనిట్--3 ఆధ్వర్యంలో ఆనూరు గ్రామంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డా. షేక్ అబ్దుల్ రెహమాన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. జి. వి. పి. పవన్ కుమార్ నాయకత్వం వహించారు.

# ఆదిత్య యూనివర్సిటీ కోచ్ "జి.వి.ప్రతాప్ రెడ్డి "కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కోచ్ గా పనిచేస్తున్న" గుడిమెట్ల వెంకట ప్రతాప్ రెడ్డి ."సన్ రైజ్ యూనివర్సిటీ రాజస్థాన్ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సన్ రైజ్ యూనివర్సిటీ రాజస్థాన్ కి చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ముకేశ్ కుమార్ నేతృత్వంలో ప్రతాప్ రెడ్డి సమర్పించిన "థీసిస్ శీర్షిక: "రోల్ ఆఫ్ జెండర్ ఇన్ స్టూడెంట్ పార్టిసిపేషన్ అండ్ పెర్ఫార్మన్స్ ఇన్ ఫిసికల్ ఎడ్యుకేషన్ " అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా." వి.ప్రతాప్ రెడ్డి గుడిమెట్ల " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి డా.నేముకూరి రవి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా. వి.ప్రతాప్ రెడ్డి గుడిమెట్ల కు అభినందనలు తెలియజేశారు.

# గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో సేవలందిస్తున్న ఫిల్డ్ అసిస్టెంట్ ల సమస్యలు పరిష్కరించాలి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు30:** 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం ఫిల్డ్ అసిస్టెంటులుగా సేవలందిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో గత 20 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో సంబంధిత సేవలు అందిస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. స్థానిక ఎం.పి.డి.వో కు డిమాండ్ లతో కూడిన వినతి ప్రతం ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం అందచేసారు. ఎటువంటి సర్వీస్ కండిషన్స్ లేకుండా సంవత్సరాల తరబడి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అనుబంధ పనుల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన వేతనాలు, ఇతర సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. 2019లో ఎఫ్.టిఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. కనీస వేతనం, ఈఎస్ ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం సేవలందిస్తున్న తమను గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం పీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

# రామవరంలో మెయిన్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో జాతీయ రహదారి నుండి ముత్యాలమ్మ చెరువు వరకు నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిలోమీటర్ మేర కాలినడకన రోడ్డు వెంబడి నడుస్తూ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నాణ్యత, కొలతలు, మెటీరియల్ వినియోగంపై అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తుల నుంచి వచ్చిన అభ్యర్థనలు , సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆర్ అండ్ బి డీఈ కేవస్ రాఘవరావు, కాంట్రాక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రజాధనంతో చేసే పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని, అంచనాలకు తగ్గట్టుగా పకడ్బందీగా రోడ్డు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, రామవరం రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మాజీ సర్పంచ్ మండపాక చిన్న, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, సీనియర్ వార్డు సభ్యులు మండపాక మణికంఠ, జనసేన మండల యువత అధ్యక్షులు మొగిలి గంగాధర్, మాజీ ఎంపీటీసీ దొడ్డ శ్రీను టీడీపీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరుపుల తమ్మయ్య బాబు కుటుంబానికి జనసేన అండగా ఉంటుంది: ఎంపీ తంగేళ్ళ.




**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** వరుపుల తమ్మయ్య బాబు కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని కాకినాడ ఎంపీ తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. మండల పరిధి లింగంపర్తి గ్రామంలో నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ ఇంచార్జ్ దివంగత నేత వరుపుల తమ్మయ్య బాబు కుటుంబాన్ని తెలిసేందుకు బుధవారం లింగంపర్తి విచ్చేశారు. తమ్మయ్య బాబు కుమారుడు సాయికిరణ్ ను కలిసి కొన్ని విషయాలు చర్చించారు. తొలుత ఎంపీ ఉదయ శ్రీనివాస్,స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు,కుడా చైర్మన్ తలాటం సత్య లు దివంగత నేత వరుపుల తమ్మయ్య బాబు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం పరుపుల సాయికిరణ్ తో కాసేపు చర్చించారు. పార్టీ అండగా ఉంటుందని ఎంపీ ఉదయ్ కిరణ్ బరోసా ఇచ్చారు.సాయికిరణ్ కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తుని జనసేన నాయకులు యనమల కృష్ణుడు, ఏలేశ్వరం మండలపార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, మీసాల రాజు,గొర్ల నాగేశ్వరరావు,పెంటకోట శ్రీధర్, తదితర జనసేన టీడీపీ నాయకులు, తమ్మయ్య బాబు అభిమానులు ఉన్నారు.

# బావారం ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పరిశీలించిన తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 30**: జగ్గంపేట మండలం బావారం గ్రామంలోని ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ బుధవారం పరిశీలించారు. ప్లాంట్‌లో బల్లి పడినట్లు మంగళవారం రాత్రి సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి ట్యాంకులు, ఫిల్టరింగ్ ప్రక్రియ, పరిసరాల పరిశుభ్రత, ప్లాంట్ నిర్వహణ తీరును పరిశీలించారు. శుభ్రత, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం కనిపించడంపై సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందించే తాగునీటి విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. రమేష్ పరిశీలనతో అప్రమత్తమైన అధికారులు డీఈ, ఏఈలు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ వద్దకు చేరుకున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందేలా ప్లాంట్ నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని రమేష్ వారికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తుమ్మలపల్లి రమేష్ జిల్లా కలెక్టర్ హారేంద్ర ప్రసాద్‌కు ఫోన్ చేసి బల్లి ఘటనతో పాటు ప్లాంట్‌లోని ప్రస్తుత పరిస్థితిని వివరించారు. తాగునీటి భద్రత దృష్ట్యా వాటర్ బెడ్‌పై మెష్‌లు ఏర్పాటు చేసి, బల్లులు, ఇతర కీటకాలు లోపలికి ప్రవేశించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కార్యకర్తలకు నాయకులు పిలుపు





**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 30** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను ప్రతి కుటుంబానికి చేరేలా కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని గండేపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ జాస్తి వసంత్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కోర్పు సాయి తేజ్, మాజీ వైస్ఎంపీపీ కుంచె రాజా, సీనియర్ నాయకుడు పరిమి బాబు పిలుపునిచ్చారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం గండేపల్లి, మురారి, నాయకంపల్లి, సూరంపాలెం, రామయంపాలెం తదితర ప్రాంతాల్లో టీడీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ సమావేశాలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముద్రించిన పుస్తకాలను కార్యకర్తలకు అందజేశారు. వాటిలోని పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను జాస్తి వసంత్ కార్యకర్తలకు చదివి వినిపించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటి ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశాల్లో బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశీ, ఇప్పెర్ల సురేష్, పండు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న సన్నిధిలో ఎన్నికల రోల్ అబ్జర్వర్-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బి. నవ్య,

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 30:**కోనసీమ తిరుమలగా భక్తజనుల విశ్వాసాన్ని చూరగొంటున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిని డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎలెక్షన్ రోల్ అబ్జర్వర్ బి. నవ్య, ఐఏఎస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ సిబ్బంది సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి గర్భాలయ సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఆమెతో పాటు ఆర్‌డీఓ జి.వి.వి. సత్యనారాయణ, ఎంఆర్‌ఓ ఆర్.డి. శ్రీరామచంద్రమూర్తి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం ఆలయ అధికారులు ఎలెక్షన్ రోల్ అబ్జర్వర్ బి. నవ్య, ఐఏఎస్‌తో పాటు అధికారులను మర్యాదపూర్వకంగా సత్కరించారు. స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యం, భక్తులకు అందుతున్న సేవలు తదితర అంశాలను ఆలయ అధికారులు వివరించినట్లు తెలిపారు.కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగగా, ఆలయ సిబ్బంది, అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.





# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి,సంక్షేమం

-రెండేళ్ల పాలన సంక్షేమం, అభివృద్ధిపై బూరుగుపూడిలో ప్రచారానికి శ్రీకారం.



**కిర్లంపూడి,పెన్ పవర్,సెప్టెంబర్ 30:**జగ్గంపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధితో పేదల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తోందని నిరూపిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు బుధవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో కూటమి నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు.మాజీ ఎంపీపీ తోట రవి, టీడీపీ సీనియర్ నేత కుంచే తాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో "2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" పేరుతో రూపొందించిన 5 పేజీల ప్రత్యేక పుస్తకాన్ని ప్రతి ఇంటికి అందించే కార్యక్రమాన్ని బూరుగుపూడి నుండి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిపై చర్చిస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.ప్రతి గ్రామానికి అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ తోట రవి, సీనియర్ టిడిపి నాయకులు కుంచే తాతాజీ, పలువురు కూటమి నాయకులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠంశెట్టి నాగేశ్వరరావు, బాలుకుల చిన్నోడు, పాఠంశెట్టి కొండరాజు, మురా సత్తిబాబు, సోము పుచ్చయ్య,కర్నాకుల వీరబాబు,కుంచే శ్రీనివాస్, కర్నాకుల సూరిబాబు, పాఠంశెట్టి తమ్మారావు, బాలిన ఎర్రిబాబు, బూత్ ఇంఛార్జ్ కొప్పన పెద్దకాపు, మరుకుర్తి తాతాజీ, గురజాపు సత్తిబాబు, జనసేన నాయకులు రామిశెట్టి రాజు, ఉలిసి శ్రీనివాస్, బీజేపీ నాయకులు బాలిన తాతాజీ, బాలిన ఎర్రిబాబు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌కు వచ్చే వారికి ఉచిత భోజనం

ఉచిత న్యాయ సలహాలు



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 30:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి తమ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు అడ్వకేట్ బి. గౌరి మణి తెలిపారు.అదేవిధంగా భూ సమస్యలు,కుటుంబ సమస్యలు,ఇతర న్యాయపరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉచిత న్యాయ సలహాలు అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు న్యాయ సలహాలు అందించి,ఆయా సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించనున్నట్లు తెలిపారు. ఉచిత న్యాయ సలహాలు పొందాలనుకునే వారు ముందుగా 9059057824 నంబర్‌కు ఫోన్ చేసి సమయాన్ని నిర్ధారించుకుని రావాలని సూచించారు. ఈ సేవల సమాచారం జిల్లాలోని ప్రజలందరికీ చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

# ఎన్నికల సంఘం ప్రధానాధికారి తక్షణమే రాజకీయ రాజీనామా చేయాలి.

- పీసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను డిమాండ్.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 30:** ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని పీసీసీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను డిమాండ్ చేశారు.ఏఐసిసి పిలుపు మేరకు, మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ఆదేశాల మేరకు. జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానంద రావు ఆదేశాలతో బుధవారం ప్రత్తిపాడు అంబేద్కర్ విగ్రహం వద్ద ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో. భారత రాజ్యాంగం లోని అతి ముఖ్యమైన సంస్థ ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఆందోళన నిర్వహించారు. జ్ఞానేష్ కుమార్ తన స్వార్థ ప్రయోజనాల కోసం దేశ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను అవినీతి మయం చేసి అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల స్యామేలు.దాసరి పోలీస్,వి.మల్లేష్,బత్తులవెంకటేష్. తదితరులు పాల్గొన్నారు

# దేశంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్న........





- కూటమి నేతల తీరు ప్రశంసనీయం: మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు.
- స్థానిక ఎన్నికల్లో గెలుపు సాధ్యమన్న ప్రతి చోట జనసేన పోటీ చేస్తుంది.

**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** భారతదేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్న కూటమి నేతల తీరు ప్రశంసనీయమని ప్రత్తిపాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మండల పరిధి లింగంపర్తి గ్రామం వరుపుల స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు.

ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన వరుపుల సుబ్బారావు సెప్టెంబర్ 21న పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేననేత వరుపుల సుబ్బారావును మర్యాద పూర్వకంగా కలిసేందుకు జిల్లాలోని ఎన్డీఏ కూటమి నేతలు విచ్చేశారు. వీరిలోఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట జ్యోతుల నెహ్రూ,జిల్లా పరిషత్ చైర్మన్ తుమ్మల బాబు, కుడా చైర్మన్ తలాటం సత్య,
టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తుని జనసేననేత యనమల కృష్ణుడు ఉన్నారు. తనను కలవడానికి వచ్చిన అందర్నీ వరుపుల ఆత్మీయంగా పలకరించి, నివాసంలో అల్పాహార విందుకు ఆహ్వానించారు. అనంతరం ఎంపీ ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రు లతో పాటు జనసేన, కూటమి నాయకులను శాలువలు వేసి, పూలమాలలతో వరుపుల సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ
జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధ్యమన్న ప్రతిచోట జనసేన పోటీ చేస్తుందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై జనసేన పార్టీలో చేరానన్నారు. నాకు అభినందనలు తెలపడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆలోచన విధానంలో రాష్ట్రం త్వరితగతిన పురోభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అద్భుత ఫలితాలను ఇస్తుందని కూటమి అగ్ర నేతలపై పొగడ్తల వర్షం కురిపించారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ బలోపేత దిశగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జ్యోతులు పెదబాబు, లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడు పెంటకోట మోహన్,ధర్మవరం సొసైటీ అధ్యక్షుడు దాసం శేషారావు, మీసాల రాజు, బుద్ధరాజు గోపిరాజు, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, దలే జ్యోతి, జోకా శ్రీను, చదలవాడ బాబి, గంగిరెడ్ల మణికంఠ, మేకల కృష్ణ, గొర్ల నాగేశ్వరరావు, పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# రామచంద్రపురం అభివృద్ధికి మరో ముందడుగు





**రూ.1.78 కోట్లతో 13 పనులకు శంకుస్థాపన**

**రామచంద్రపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 30 :**రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పట్టణంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య మెరుగుదల, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.1.78 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం శంకుస్థాపనలు చేశారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ఆర్ రాజు తదితరులతో కలిసి మంత్రి ఆయా ప్రాంతాల్లో పనులను ప్రారంభించారు.

15వ ఆర్థిక సంఘం నిధులు, ప్లాన్ గ్రాంట్, రుడా నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలకు నిత్యజీవితంలో ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణాన్ని మరింత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు దశలవారీగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గతంలో అభివృద్ధికి నోచుకోని పలు ప్రాంతాల్లో ఇప్పుడు పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే రామచంద్రపురం పట్టణంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని పనులను దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.వార్డుల వారీగా అభివృద్ధి పనులు ఇలా..

20వ వార్డు -- రూ.39.46 లక్షలు:
కమ్మవారి సావరం నారాయణ కళాశాల నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు, అక్కడి నుంచి నెక్కంటి వీర వెంకట సత్యనారాయణమూర్తి నివాసం వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం.

21వ వార్డు -- రూ.44.93 లక్షలు:
నెక్కంటి వీర వెంకట సత్యనారాయణమూర్తి ఇంటి నుంచి ముచ్చిమిల్లి రోడ్డు వరకు ఆర్‌సీసీ డ్రెయిన్, రత్నంపేటలో ఏపీ గ్రామీణ బ్యాంక్ నుంచి బుల్లెట్ నాగేశ్వరరావు వీధి వరకు సీసీ డ్రెయిన్, బుల్లెట్ నాగేశ్వరరావు వీధి నుంచి ఫుడ్ హౌస్ వరకు ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం.

16వ వార్డు -- రూ.8.68 లక్షలు:
ఓలేటి శ్రీను నివాసం నుంచి చామర్తి వంశీ నివాసం వరకు సీసీ రోడ్డు నిర్మాణం.

12వ వార్డు -- రూ.4.71 లక్షలు:
ఆఫిషియల్ కాలనీలో డ్రెయిన్ నిర్మాణం.

18వ వార్డు -- రూ.5.89 లక్షలు:
గంగుమల్లవారి వీధిలోని వినాయక ఆలయం వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణం.

8వ వార్డు -- రూ.9.21 లక్షలు:
సేనాపతులవారి వీధిలో డ్రెయిన్ మరమ్మతులు, గోడ ఎత్తు పెంపుతో పాటు వినాయక ఆలయం పరిసరాల్లో డ్రెయిన్ నిర్మాణం.

4వ వార్డు -- రూ.9.09 లక్షలు:
డి.నెం.14-8-50/9 నుంచి మోదరన్ కాలేజీ వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణం.

2వ వార్డు -- రూ.13.76 లక్షలు:
స్టిల్‌వెల్‌పేటలో చేనేత కార్మిక భవనం మరమ్మతులు, కొత్తూరు రోడ్డులో బాలికల హాస్టల్ వెనుక భాగంలో సీసీ డ్రెయిన్ నిర్మాణం.

1వ వార్డు -- రూ.31.86 లక్షలు:
బాలాజీ ఆలయం నుంచి ఎస్‌టీపీపీ మున్సిపల్ హైస్కూల్ జంక్షన్ సమీపం వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం.

పట్టణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సుభాష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, ఏఈ సునీల్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, కంచుమర్తి బాబురావు, కట్టా నాగేశ్వరరావు, అక్కల రాగూర్, కడియాల రాఘవన్, సంపత్ సత్యనారాయణమూర్తి, చందాల మల్లిబాబు, చింతాకుల ప్రకాష్, చిక్కాల బాబ్జి, సంధ్యారాణి, దోమ్మలపాటి విజయలక్ష్మి, సవరం సుధీర్‌తో పాటు అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# రెడ్ రన్ మారథాన్‌లో ఆదిత్య విద్యార్థినికి ప్రథమ స్థానం

**జిల్లా స్థాయి 5 కి.మీ. పరుగు పోటీలో విజేతగా పి. వెంకట తులసి**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 30:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కి.మీ. రెడ్ రన్ మారథాన్ పోటీల్లో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థిని పి. వెంకట తులసి ప్రథమ స్థానం సాధించారు. విజేతకు రూ.10,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేశారు.ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ మారథాన్‌ను నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలో ప్రథమ స్థానాన్ని సాధించిన వెంకట తులసిని కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిత్య కళాశాల విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా కళాశాల తరఫున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రెడ్ రన్ మారథాన్ నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.విజేత పి. వెంకట తులసిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణ, చేంజెస్ కాకినాడ ఎన్‌జీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. పుష్పకుమారి, మేనేజర్ పి. దుర్గాభవాని, అకౌంటెంట్ ఎస్. శివ, ఎన్ఎస్ఎస్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, చేంజెస్ కాకినాడ ఎన్‌జీవో సభ్యులు అభినందించారు.



# రెవెన్యూ సేవల్లో ప్రజా సంతృప్తే లక్ష్యం



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 30:** పేదలు, సామాన్య ప్రజల పక్షాన నిలిచి రెవెన్యూ సేవలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, అంకితభావంతో అందించి ప్రజా సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్లతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ క్లినిక్ల నిర్వహణ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ, డిజిటలైజేషన్, రీ-సర్వే, ఆన్‌లైన్ దరఖాస్తులు, కోర్టు కేసులు, రెవెన్యూ సేవల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ఉత్తమ పద్ధతులను అవలంబించాలని సూచించారు.

**64 గ్రామాల్లో రీ-సర్వే వేగవంతం**

జిల్లాలో ఇంకా రీ-సర్వే పూర్తికాని 64 గ్రామాల్లో ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాలిడేషన్, నోటీసుల జారీ తదితర ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వే ద్వారా భూములకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**పాస్ పుస్తకాల పంపిణీపై ప్రత్యేక దృష్టి**

అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, బుక్ ఫర్ ప్రింటింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి నెల మొదటి వారంలో అర్హులైన లబ్ధిదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ అధికారులు ప్రతి వారం రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నందున జిల్లాలో నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు.

**ఫిర్యాదులకు గడువులోగా నాణ్యమైన పరిష్కారం**

పీజీఆర్ఎస్ ద్వారా అందే దరఖాస్తులతో పాటు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు.ప్రధానంగా ఐదు రకాల రెవెన్యూ సేవల్లో ప్రజా సంతృప్తి స్థాయిని మెరుగుపరచాలని, ఎఫ్-లైన్ పిటిషన్లు, రీ-సర్వేకు సంబంధించిన వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు.

**ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు**

ప్రత్తిపాడు మండలంలో అక్టోబర్ 24న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో గృహ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ, కనీస వసతుల కల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అవసరమైన స్థలాలను కేటాయించే ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు అందించే ప్రతి రెవెన్యూ సేవలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం ఉండేలా అధికారులు పనిచేయాలని, ప్రజల సమస్యలకు సానుకూల దృక్పథంతో పరిష్కారం చూపడం ద్వారా రెవెన్యూ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు ఎస్.మల్లిబాబు,పి.కృష్ణమూర్తి, ఎస్.డి.సి.శ్రీరమణి,తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న 618 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

రూ.1.23 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను సేకరించిన కాకినాడ జిల్లా పోలీసులు





**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 30:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్‌వర్క్ నిఘా, డేటా విశ్లేషణ పద్ధతులను ఉపయోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అప్పగించడంలో కాకినాడ జిల్లా పోలీసులు మరోసారి సఫలీకృతులయ్యారు. మొత్తం రూ.1 కోటి 23 లక్షల 60 వేల విలువైన 618 సెల్‌ఫోన్లను బుధవారం బాధితులకు అప్పగించారు.సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని ప్రత్యేకంగా దర్యాప్తు నిర్వహించి ఈ సెల్‌ఫోన్లను గుర్తించి సేకరించినట్లు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపారు. తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు.ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 13 విడతల్లో మొత్తం రూ.8 కోట్ల 92 లక్షల 27 వేల విలువైన 5,221 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు గుర్తించి సేకరించినట్లు తెలిపారు.మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా ప్రజలు వెంటనే సంబంధిత సిమ్ కార్డును, బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించుకోవాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను అపరిచిత వ్యక్తుల నుంచి కొనుగోలు చేయవద్దని సూచించారు.పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి సేకరించడంలో విశేష ప్రతిభ కనబరిచిన జిల్లా ఐటీ కోర్ పోలీసు సిబ్బందిని ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ ఎం. కిషోర్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి రావు, ఐటీ కోర్ సిబ్బంది, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి.



- పొలాల్లో నీటిని తొలగించి, మందులు పిచికారీ చేయాలి
- సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.కె.వి.చౌదరి

**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**తుఫాను వర్షాల నేపథ్యంలో ఆలమూరు మండల పరిధిలోని వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ)సిహెచ్.కె.వి.చౌదరి కోరారు. ఆయన బుధవారం మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు.ప్రస్తుతం పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల వరి పంటకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరి పంట ఇప్పుడు పొట్ట దశలో ఉన్నందున, అధిక తేమ కారణంగా కాండం తొలిచే పురుగు, పొట్టకుళ్ళు మరియు మాగుడు తెగుళ్ల ఆశించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.ఈ పరిస్థితిని అధిగమించడానికి రైతులు ముందుగా పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పొట్టకుళ్ళు, మాగుడు తెగుళ్ల నివారణ కోసం లీటరు నీటికి 2 మి.లీ. ప్రొపికోనజోల్ కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. అలాగే కాండం తొలిచే పురుగు ఆశించకుండా జాగ్రత్తగా లీటరు నీటికి 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 2 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని ఎ.డి.ఎ చౌదరి రైతులకు వివరిస్తూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ధర్మవరం గ్రామంలో ఉద్యాన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు.

- రైతులకు యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 30:**ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ముంపుకు గురైన ప్రత్తి పొలాలను,కూరగాయలు, బొప్పాయి, పూల తోటలను ఏరువాక కేంద్రం సమన్వయకర్త, డాక్టర్ సీతారామ శర్మ,ఉద్యాన శాఖ ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన అధికారి కె దివ్యశ్రీ, వ్యవసాయ అధికారిణి జోకా అమృత బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల్లో తెగుళ్లు, పురుగుల నివారణతో పాటు రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆకాకర, చిక్కుడు పంటల్లో విరిగిన కొమ్మలు, కుళ్లిన ఆకులు, కాయలను తొలగించాలని సూచించారు. ఆకుమచ్చ, కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం, వేరుకుళ్లు నివారణకు బ్లైటాక్స్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదల్లో పోయాలని తెలిపారు. పురుగుల నివారణకు సూచించిన మందులను సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని సూచించారు. నేలలో నీరు తగ్గిన అనంతరం 19:19:19 నీటిలో కరిగే ఎరువును 5 గ్రాములు లీటరు నీటికి లేదా పంటకు అనుకూలమైన నీటిలో కరిగే ఎన్‌పీకే, సూక్ష్మపోషకాలను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయడం ద్వారా పూత, పిందె నిలిచి దిగుబడి మెరుగుపడుతుందని వివరించారు. బొప్పాయి తోటల్లో కుళ్లిన ఆకులు, పండ్లు, కాండం భాగాలను తొలగించాలని సూచించారు. వేరుకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద మట్టి తడిచేలా పోయాలని తెలిపారు. కాపు వచ్చిన తోటల్లో పండ్ల కుళ్లు నివారణకు హెక్సాకోనాజోల్‌ను సిఫార్సు చేసిన మోతాదులో స్టిక్కర్‌తో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గులాబీ తోటల్లో కొమ్మల కత్తిరింపులు చేసి కార్బెండజిమ్ లేదా బ్లైటాక్స్ పిచికారీ చేయడం ద్వారా ఎండు తెగులును నియంత్రించవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ అర్జున్, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు సత్తిబాబు, రామలక్ష్మి, బాబీతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## నరసింహదేవర సేవలు చిరస్మరణీయం

స్వర్గీయ మాజీ ఎమ్మెల్సీ నరసింహాదేవర 72వ వర్ధంతి



**ఆలమూరు,పెన్ పవర్,సెప్టెంబర్ 30:**స్వర్గీయ మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర సత్యనారాయణ రైతుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వ్యక్తులు అన్నారు. మద్రాస్ ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసిన నరసింహదేవర 72వ వర్ధంతి ఆలమూరు సహకార సంఘం ఆవరణలో బుధవారం అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రైతులకు అన్ని రకాలుగా ఉపకరించే విధంగా దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా రైతుల కోసం సహకార రూరల్ బ్యాంకును ఆలమూరులో స్థాపించిన ఘనత నరసింహదేవరకు దక్కుతుందని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. నరసింహదేవర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సహకార సంఘం సీఈవో బొబ్బా సుబ్రహ్మణ్యం, సిబ్బంది సింగ్ బాబు, రాజా, కూటమి నాయకులు రామానుజనుల సూర్య ప్రకాష్, గుడాల శ్రీను, ఈదల నల్ల బాబు, కేత రాంబాబు, చల్లా బాబి, బైరిశెట్టి రాంబాబు, రామానుజునుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, గుత్తుల కిరణ్, రావాడ సత్తిబాబు,సాలి సత్యనారాయణ, చల్లాఏడుకొండలు, తదితరులు నివాళులర్పించారు.

## ఏలూరులో ఘనంగా బలరాముని జయంతితోపాటు రైతు దినోత్సవ వేడుకలు.

-అక్టోబరు 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 30:**ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో బుధవారం సాయంత్రం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరాముని జయంతితోపాటు రైతు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా బలరాముడు, భారతమాత చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 6న విజయవాడలో నిర్వహించనున్న రైతుల నిరసన, శక్తి ప్రదర్శన కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రముఖ్ దాడిశెట్టి ప్రేమలీల, గ్రామ అధ్యక్షుడు ఆకేటి భద్రరావు, కార్యదర్శి కొట్టేటి నాని, సభ్యులు ధరంపూడి శేషు, కోలా వెంకటేశ్వరరావు, ఉంగరాల కృష్ణ, దాడిశెట్టి దొంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది.





గణపతి మాస్టారు కు ఘన సన్మానం.

**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ అన్నారు. సింగంపల్లి గణపతి రావు మాస్టారు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక కోనేటి బడి ప్రాంగణంలో సన్మాన సభ బుధవారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ గణపతి రావు మాస్టర్ శిష్యురాలిగా చదువుకున్న నేను, నేడు ఎమ్మెల్యేగా ఆయనను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎంబి ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ గణపతి రావు మాస్టారు నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడే కాక యూటీఎఫ్ ద్వారా అనేక ఉద్యమ పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. యుటిఎఫ్ సీనియర్ నేతలు మెతకాని రాంబాబు, ఎస్. రాజశేఖర్ మండల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బి రాంబాబు, ప్రసాద్, కోశాధికారి టీ. మురళీకృష్ణ, పాఠశాల హెచ్ఎం. జయశ్రీ, కూటమి నాయకులు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా ఉదయం నుంచి గణపతి రావు మాస్టారు శిష్యులు, మిత్రులు మాస్టారు సేవలను కొనియాడారు. తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, ఉద్యోగ కాలంలో ఏ విధమైన రిమార్క్ లేకుండా బాధ్యతలు నిర్వహించిన గణపతి మాస్టర్ అభినందనీయుడని ప్రశంసించి, ఘనంగా సన్మానించారు.

# ఆలమూరు లో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవం

**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** ప్రధాని మోదీ జన్మదినోత్సవ మహోత్సవాలు, సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మండల కేంద్రమైన ఆలమూరు శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ సిడిపిఓ ఏ గజలక్ష్మి సూచనలు మేరకు సూపర్‌వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల టిడిపి అధ్యక్షులు ఈదల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) సహకారంతో గర్భిణీ స్త్రీలకు సంప్రదాయ పద్దతిలో సీమంతాలు నిర్వహించారు. ఆలమూరు సెక్టార్ పరిధిలో చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహార ప్రాధాన్యం, పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ వేడుకను ఏర్పాటు చేశారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల విద్యకు పునాది అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడుతుందని తెలిపారు.? అనంతరం ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎం,ఆశ వర్కర్లు, గర్భిణీ బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.



## మందపల్లి మందేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.9.12 లక్షలు





**కొత్తపేట,పెన్ పవర్, సెప్టెంబర్ 30:** శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు, స్వచ్ఛంద సేవకుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఆరు నెలల ఏడు రోజుల కాలానికి మందేశ్వర స్వామివారి హుండీ ద్వారా రూ. 8,11,454, వేణుగోపాల స్వామివారి హుండీ ద్వారా రూ. 47,391, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ. 53,506 చొప్పున మొత్తం రూ. 9,12,351 ఆదాయం సమకూరింది.రావులపాలెం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎం. రాధాకృష్ణ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రి, శ్రీనివాస్, కోటిపల్లి సుబ్బలక్ష్మి, సుబ్రహ్మణ్యం, అర్చకులు, మండపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ చైర్మన్ సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ, గ్రామ పెద్దలు, వీఆర్వో ఉత్తర కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల విజ్ఞాన యాత్ర....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 30:-** రైతుల క్షేత్ర సందర్శన ద్వారా పంటల సాగులో విజ్ఞానం పెంచుకోవాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. ఆత్మ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ పరిశోధన కేంద్రం, పెద్దాపురం మరియు సామర్లకోట లోని భూసార పరీక్ష కేంద్రం,జీవన ఎరువులు తయారీ కేంద్రం మరియు విత్తనాభివృద్ధి కేంద్రాలను సందర్శించి శాస్త్రవేత్తలు మరియు అధికారులతో చర్చా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం మొక్కజొన్న, చిరుధాన్యాలు,అపరాలు, వరి పంటలను శాస్త్రవేత్తలతో పరిశీలించి రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ప్రధాన శాస్త్రవేత్త డా.రామభద్ర రాజు, శాస్త్రవేత్తలు డా.సుధీర్, డా.సుజాత, భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి లక్ష్మీ, వ్యవసాయ అధికారి పి గాంధీ, బి టి ఎం ఎం బాబురావు, ఏ ఈ ఓ శ్రీనివాస్, వ్యవసాయ సహాయకుడు క్రాంతి,రైతులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై రౌతులపూడిలో వైఎస్సార్‌సీపీ పోరు బాట....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 30:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో రౌతులపూడి మండలం ఎస్. అగ్రహారం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ ఆధ్వర్యంలో వెన్నుపోటు ప్రభుత్వం -- వెన్నుపోటు పాలనపై పోరు మండల స్థాయి కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందించకుండా ప్రజలను తీవ్రంగా మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజలంతా గమనించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ముఖ్య నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని మహోద్యమంగా విజయవంతం చేశారు.ఈ సందర్భంగా రౌతులపూడి మండలంలో జిల్లా, మండల స్థాయిల్లో వివిధ పదవులకు నూతనంగా ఎంపికైన నాయకులకు, ముద్రగడ గిరిబాబు చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ అధికారిక ఐడీ కార్డులను అందజేశారు.

## కాపుజేఏసీజిల్లా కమిటీకు టీ.ఆర్.ప్రసాద్ ఎంపిక



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.30.** పోలవరంజిల్లా(కాపు)తూర్పుకాపు,మున్నూరుకాపు , తెలగ,బలిజ,ఒంటరితదితర,కాపుసామాజిక వర్గాల ఐక్యత,హక్కులు,సమస్యలపరిష్కారం కోసంపనిచేస్తు న్నకాపుజేఏసీ,పోలవరంజిల్లాలోనూతనబాధ్యతలు చే పట్టారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్,నాయుడు ఆదేశాల మేరకు టీ.ఆర్. ప్రసాద్‌ను పోలవరం జిల్లా కాపు జేఏసీ జిల్లా కమిటీ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా టీ.ఆర్. ప్రసాద్,మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన కాపు జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలోని కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలనుఐక్యం చేస్తూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసు కెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కాపు సామాజిక వర్గానికిచెందిన పేదలు, మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక సమ స్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంద న్నారు.యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.పోలవరం జిల్లా పరిధిలోని కాపు,తూర్పు కాపు.మున్నూరు కాపు.తెలగ, బలిజ, ఒంటరి తదితర వర్గాలను సమన్వయం చేసుకుని జేఏసీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని న్నారు.సామాజిక ఐక్యతతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ రాష్ట్ర కాపు జేఏసీ నాయకత్వం సూచనల మేరకు ముందుకు సాగుతానని టీ.ఆర్. ప్రసాద్ పేర్కొన్నారు.నియామకం పట్ల కాపు జేఏసీ నాయకులు, కార్యకర్తలు,పలువురు అభినందనలు తెలిపారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

**'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు పాస్ పుస్తకాలు అందజేత**




**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:**రైతుల భూమి హక్కులకు భరోసా కల్పించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.బుధవారం గంగవరం మండలం ఆముదాలబంద పంచాయతీ పరిధిలోని ఆముదాలబంద గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.రైతులకు భూమిపై ఉన్న హక్కులను పటిష్టం చేయడంతో పాటు, భూ సంబంధిత వివరాలను అధికారికంగా నమోదు చేసుకోవడంలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, మాజీ సర్పంచ్ నీలాద్రి లక్ష్మి, బూత్ కన్వీనర్ కుంజం కృష్ణమూర్తి దొర, గ్రామ పెద్దలు మడకం రామన్నదొర, వీఆర్వో అప్పలకొండ, వ్యవసాయ సహాయకుడు కళ్యాణ్ నాయుడు, ఇతర నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మడికి నర్సరీలో యువకుడి అనుమానాస్పద మృతి



**ఆలమూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 30:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం మడికి గ్రామ పరిధిలో బుధవారం తెల్లవారుజామున ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మడికి శివారు గ్రామమైన చిలకలపాడుకు చెందిన మింగి రమేష్ (24) అనే యువకుడిగా మృతుడిని పోలీసులు గుర్తించారు. స్థానిక ఒక నర్సరీలో ఈ ఘటన చోటుచేసుకుంది.ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ , సీఐ విద్యాసాగర్ల పర్యవేక్షణలో ఆలమూరు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం డాగ్ స్క్వాడ్ (క్లూస్ టీమ్) సాయంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని నిశితంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు.ఇది హత్య? లేక మరేదైనా కారణం ఉందా? అనే పలు కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## నగర, గ్రామీణ నియోజకవర్గాల ఓటర్ల జాబితాపై సమీక్ష



**పరిశీలకులు కె. మాధవీలత**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో చేపడుతున్న చర్యలను తూర్పు గోదావరి జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, ఏపీ రైతు బజార్ల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. మాధవీలత బుధవారం సమీక్షించారు.స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పరిశీలన, తిరస్కరించిన దరఖాస్తులకు నమోదు చేసిన కారణాలు, ఓటర్ల తొలగింపునకు ముందు చేపడుతున్న క్షేత్రస్థాయి ధ్రువీకరణ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, సవరణలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తు తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం–6 దరఖాస్తుల తిరస్కరణలపై బూత్ స్థాయి అధికారులు శ్రద్ధ వహించి, తిరస్కరణకు ముందు ప్రతి అంశాన్ని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోనూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు, తప్పులు ఉన్న సందర్భాల్లో సంబంధిత వివరాలను, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సరిచూడాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన వారు ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ప్రతి చర్యను నిబంధనలకు అనుగుణంగా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలకు తదుపరి దశల్లో అవకాశాలు ఉన్నప్పటికీ, కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం–6 దరఖాస్తు తిరస్కరణకు గురైతే అర్హులైన వ్యక్తికి ఓటు హక్కు పొందడంలో ఆలస్యం జరిగే అవకాశం ఉన్నందున, దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. నవంబర్‌లో సమ్మరీ రివిజన్ ప్రక్రియ ప్రారంభం కానున్నం దున, అర్హులైన వారు ఆ అవకాశాన్ని వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమీక్ష సమావేశాల్లో కమిషనర్ రాహుల్ మీనా, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎమ్మార్వోలు రంజిత్ కుమార్, శ్రీనివాస్ రావు, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, ఇతర ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఈసీ వివాదంలో టీడీపీ స్టాండ్ ఇదే.. మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఎన్నికల కమిషన్ వివాదంపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ తొలిసారి స్పందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంపై జాతీయ స్థాయిలో ఆందోళనలు చేయగా, ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యాఖ్యలు చేశాయని అంటున్నారు. ఈ విషయంలో ఈసీ నిజాయితీని నిరూపించుకోవాలని టీడీపీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక జాతీయ మీడియా చానల్ నిర్వహించిన కాంక్లేవ్ లో పాల్గొన్న మంత్రి లోకేశ్ ఈ వివాదంపై ఎదురైన ప్రశ్నకు ఆసక్తికరంగా సమాధానమిచ్చారని అంటున్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని, కమిషన్‌లోని ఇతర సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని విపక్షాలు విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతంగా ఉండాల్సిన స్వయంప్రతిపత్త సంస్థలోనూ పారదర్శకత కొరవడిందంటూ జాతీయ స్థాయిలో ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున దుమారం రేపుతున్నాయి. ఈ తరుణంలో ఎన్డీయే కూటమిలోని టీడీపీ, ఎల్జేపీ వంటి మిత్రపక్షాలు ఈ వివాదాన్ని ఎలా చూస్తున్నాయనే దానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

**విమర్శలను తోసిపుచ్చిన లోకేశ్**

ఈ వివాదంపై జాతీయ మీడియా వేదికగా స్పందించిన నారా లోకేశ్.. ప్రతిపక్షాల వాదనలను గట్టిగా తిప్పకొట్టారు. ఎన్నికల్లో ఓటమి పాలైన ప్రతిసారీ నిందలను ఈసీపై, వ్యవస్థలపై నెట్టడం ప్రతిపక్షాలకు ఒక అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ లేదా ఈసీ పక్షపాత వైఖరిపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ... ఒకవేళ ఈవీఎంలు అధికార పక్షానికి అనుకూలంగా పనిచేస్తే, కేరళ, తెలంగాణ వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచింది? అని లోకేశ్ సూటిగా ప్రశ్నించారు. దీనివల్ల ఈసీ తీరుపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో హేతుబద్ధత లేదని ఆయన స్పష్టం చేశారు.

**నిబంధనలపై స్పష్టత, వ్యవస్థలపై గౌరవం**

గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఎన్నికల ప్రక్రియ మరియు 'ఎస్ఐఆర్' (ూ×=) విధానంపై కొన్ని సందేహాలు తలెత్తిన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. అయితే, ఆ సందర్భంలో తాము కేవలం ఆరోపణలు చేయకుండా, నేరుగా ఎన్నికల కమిషన్‌ను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నామని తెలిపారు. ఒక రాజకీయ పార్టీగా వ్యవస్థలను అకారణంగా విమర్శించడం కంటే, అనుమానాలు ఉన్నప్పుడు అధికారులను కలిసి వాస్తవాలు తెలుసుకోవడం బాధ్యత అని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాల సవరణ వంటి అంశాలపై పట్టుదలగా పనిచేయడమే అసలైన రాజకీయ పద్ధతి అని టీడీపీ నిరూపించిందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్ణయాలు, కమిషన్‌లోని అంతర్గత భిన్నాభిప్రాయాలపై జాతీయ రాజకీయాలు వేడెక్కిన వేళ ఎన్డీయే కూటమి తరపున నారా లోకేశ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ విమర్శలను తిప్పకొడుతూ, ఎన్నికల సంఘంపై నమ్మకం ఉంచాలని ఇతర మిత్రపక్షాలకు లోకేశ్ ఇచ్చిన స్పష్టమైన సందేశం ఇచ్చారని అంటున్నారు. అంతేకాకుండా లోకేశ్ వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో ఎన్డీయే మిత్రపక్షాల దృఢమైన వైఖరికి అద్దం పడుతున్నాయని అంటున్నారు.

# ఏబీవీ దెబ్బకు దిగి వచ్చిన ప్రభుత్వం.. రిటైర్డ్ ఐపీఎస్ తొలి విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) విమర్శలతో ప్రభుత్వం దిగి వచ్చింది. తప్పు ఎత్తి చూపితే సవరించుకుంటామని సంకేతాలిచ్చిందని అంటున్నారు. ప్రభుత్వ ప్రకటనలు, ఇతర కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించడం లేదని ఇటీవల ఏబీవీ చేసిన విమర్శలు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. అయితే ఈ విషయమై నేరుగా స్పందించని ప్రభుత్వం తాజాగా చేపట్టిన కార్యక్రమంలో ఆ పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంది. దీంతో ఏబీవీ విమర్శలు పనిచేశాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పేదలకు పట్టాభిషేకం పేరుతో విశాఖ, విజయవాడ తదితర ప్రధాన పట్టణాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి శాశ్వత హక్కులు కల్పించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. ముందుగా విశాఖలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ సమయంలో పత్రికలకు జారీ చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ తోపాటు మంత్రి లోకేశ్ ఫొటోలను వేశారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా ఏబీవీ ప్రశ్నలు సంధించారు. ప్రోటోకాల్ పాటించాల్సిన ప్రభుత్వం మంత్రులను కూడా పక్కన పెడుతున్నట్లు సంకేతాలిస్తోందని విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ప్రభుత్వ అధినేతగా ముఖ్యమంత్రి ఫొటో వేయవచ్చని, కానీ పవన్, లోకేశ్ ఫొటోలు ఏ విధంగా వేస్తారని నిలదీశారు. ప్రభుత్వాన్ని మీ ముగ్గురే నడిపేయొచ్చు కదా, మిగతా మంత్రులు ఎందుకు అంటూ ప్రశ్నలు సంధించారు.దీంతో ప్రభుత్వం ఆలోచనలో పడినట్లుగా చెబుతున్నారు. ఈ విషయంలో ఏబీవీ లేవనెత్తిన అభ్యంతరం సహేతుకమైనదని భావించిందని అంటున్నారు. ఫలితంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించి పత్రికలకు జారీ చేసిన ప్రకటనల్లో తొలిసారిగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫొటో వేశారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ ఫొటోలతో మాత్రమే ప్రకటనలు ఇస్తున్నారని అంటున్నారు. కానీ ఏబీవీ విమర్శలతో



ఇప్పుడు సంబంధిత మంత్రుల ఫొటో కూడా ప్రకటనల్లో ముద్రించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఏబీవీ ప్రభుత్వంపై విజయం సాధించారని పరిశీలకులు చమత్కరిస్తున్నారు.

ఇక రాజకీయాలపై ఆసక్తితో కొత్త పార్టీని ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన రిటైర్డ్ పోలీసు అధికారి ఏబీవీ గత కొంతకాలంగా రాష్ట్రంలోని పలు సామాజిక సమస్యలపై పోరాడుతున్నారు. ప్రధానంగా 22ఏ భూ సమస్యలతోపాటు ప్రభుత్వ కాంట్రాక్టులు, ప్రజాధనం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్న పలు ప్రాజెక్టులపై నిపుణులతో కలిసి గళం విప్పుతున్నారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై పోరాడుతున్నారని అంటున్నారు. దీంతో ప్రభుత్వం కూడా ఏబీవీ చేసే విమర్శలపై ఓ కన్నేసినట్లు చెబుతున్నారు. నిజానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా గతంలో వ్యవహరించిన ఏబీవీ.. ఇప్పుడు ఎదురుతిరగటమే కాకుండా ప్రభుత్వాన్ని ఇరుకన పెట్టేలా చేస్తున్న విమర్శలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చేస్తున్న విమర్శల్లో సహేతుకమైన అంశాలు ఉంటే ప్రభుత్వం సరిదిద్దుకోవడం ద్వారా ఆయనతో సామరస్యంగా ఉండేందుకు ప్రాధాన్యమిస్తోందని అంటున్నారు.

# SR01 లోకల్ బాడీ ఎన్నికలు యధాతధం

**విజయవాడ, సెప్టెంబర్ 30 పెన్ పవర్:** స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం ఒక క్లారిటీ ఇచ్చింది. ఎన్నికలు ఇంకో రెండు నెలలు ఆలస్యం అవుతాయనే వార్తలను ఖండించింది. పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారమైన మీడియా సమావేశం ద్వారా వెల్లడిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని నమ్మే ముందు.. సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలతో ధ్రువీకరించుకోవాలని సూచించింది. అలాగే స్థానిక ఎన్నికలపై పుకార్లు సృష్టించినా, ఫార్వార్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఏపీ స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మరో రెండు నెలలు ఆలస్యం అవుతుందనే వార్తలను ఖండించింది. ఈ పుకార్లలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల ఆలస్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇందులో ఏ మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. ఈ ఫేక్ వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని తెలిపింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల కోర్టు కేసులపై క్లారిటీ వచ్చాకే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారంలో నిజం లేదని ఏపీ ఎస్ఈసీ వెల్లడించింది. స్థానిక ఎన్నికలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి కల్పిత సమాచారాన్ని ఇతరులకు పంపించ వద్దని ఎన్నికల సంఘం కోరింది.ఏపీ స్థానిక ఎన్నికల సమాచారాన్ని మీడియా సమావేశాల ద్వారా వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. ఎన్నికల కమిషన్ పేరుతో కల్పిత, తప్పుదారి పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని పుట్టించినా, ఫార్వార్డ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసెజ్‌లను నమ్మే ముందు ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక ప్రకటనల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది.ఏపీలో మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తుంది. అయితే ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడ లేదు. కానీ ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో ఈ ఎన్నికల హడావిడి కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సన్నాహాలు చేసుకుంటున్నాయి. కాగా గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపొందింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం సాధించింది. మరి 2026 స్థానిక ఎన్నికల్లో ఎవరిదీ పై చేయిగా ఉండబోతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

## పల్లె పండుగ 3.0

**నెల్లూరు, సెప్టెంబర్ 30 పెన్ పవర్: :** వైసీపీ ఐదేళ్ల హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై, కనీస రహదారుల నిర్వహణ లేక రాష్ట్రంలోని పల్లెలు తీవ్ర అంధకారంలోకి వెళ్లిన సమయంలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. నిధుల కేటాయింపులు, పారదర్శక పాలన , స్వర్ణ పంచాయతీ పోర్టల్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ఆగిపోయిన నిధులను పంచాయతీలకు మళ్లించి వ్యవస్థకు కొత్త ఊపిరి పోశారు. ఆయన పట్టుదలతో శాఖలో పనులు వేగవంతమై, గతంలో ఎన్నడూ లేని విధంగా 13,218 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించడం పవన్ కళ్యాణ్ నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలిచింది.పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన అపూర్వమైన చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా గుంతలమయమైన రహదారులకు మహర్దశ పడుతోంది. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, గత పల్లె పండుగ 1.0, 2.0 విడతల్లో వేలాది కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లను, మినీ గోకులాలు , ఇతర మౌలిక వసతులను రికార్డు సమయంలో పూర్తి చేసి పవన్ కళ్యాణ్ తమ శాఖ సామర్థ్యాన్ని నిరూపించారు. గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా, ప్రాధాన్యత క్రమంలో అన్ని ప్రధాన రహదారులను సురక్షితంగా మార్చేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు.ఈ దిశగా పంచాయతీరాజ్ శాఖను మరింత పరుగులు పెట్టిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ. 11,085 కోట్ల భారీ నిధులతో గ్రామీణ రూపురేఖలను మార్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విప్లవానికి తెరలేపారు. గ్రామీణ పేదరికం నిర్మూలనతో పాటు మౌలిక వసతుల కల్పనలో పంచాయతీరాజ్ శాఖ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవడం పవన్ విజన్‌కు అద్దం పడుతోంది.ఈ పల్లె పండుగ 3.0 ద్వారా పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ ఏకంగా 15,500 కిలోమీటర్ల మేర రవాణా సౌకర్యాలను విస్తరించనుంది. ఇందులో రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు, రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. వీటితో పాటు పాడి రైతుల కోసం రూ. 300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, రూ. 225 కోట్లతో ఉద్యాన పంటల పెంపకం, రూ. 110 కోట్లతో మ్యాజిక్ డ్రెయిన్లు , రూ. 200 కోట్లతో పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ, నిరంతర పర్యవేక్షణతో పంచాయతీరాజ్ శాఖ నేడు దేశంలోనే నంబర్ వన్ స్థానానికి దిశగా అడుగులు వేస్తోంది.

# ఓవర్‌డ్రాఫ్ట్ సంక్షోభం నుంచి స్వయం సమృద్ధి దిశగా ఏపీ !

**విజయవాడ,సెప్టెంబర్ 30 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత రెండేళ్లలో విప్లవాత్మకమైన మార్పును సాధించింది. నిత్యం ఓవర్‌డ్రాఫ్ట్‌పై ఆధారపడే దయనీయ పరిస్థితి నుంచి సొంత కాళ్లపై నిలబడే స్వయం సమృద్ధి స్థాయికి రాష్ట్ర ఆర్థిక శాఖ చేరుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ, నిధుల వినియోగంలో పాటిస్తున్న విచక్షణ రాష్ట్ర ఆర్థిక మూలాలను పటిష్టం చేశాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఖజానా నిర్వహణకు, ఉద్యోగుల జీతభత్యాల కోసం ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవడం సర్వసాధారణంగా మారగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందనడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారిక నివేదికలే అద్దం పడుతున్నాయి.ఆర్బీఐ విడుదల చేసిన ఫైనాన్షియల్ అకామడేషన్ అవైల్డ్ బై స్టేట్ గవర్నమెంట్స్ గణాంకాల ప్రకారం.. 2026 ప్రారంభ నెలల్లో ఏపీ ఆర్థిక క్రమశిక్షణ ఎంత వేగంగా పుంజుకుందో స్పష్టంగా తెలుస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్రం ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని కేవలం ఒక్క రోజు మాత్రమే వినియోగించుకోగా , ఆ తర్వాతి నెల అయిన మే-2026 నాటికి ఓవర్‌డ్రాఫ్ట్ రోజుల సంఖ్య జీరోకు పడిపోయింది. అంటే మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఓడీ తీసుకోకుండా తన అవసరాలను స్వయంగా తీర్చుకోగలిగింది. దేశంలో పలు ఇతర రాష్ట్రాలు ఇప్పటికీ భారీగా ఓడీ, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై ఆధారపడుతుండగా.. ఆంధ్రప్రదేశ్ మాత్రం నెల రోజుల్లోనే ఓడీ రహిత రాష్ట్రంగా నిలవడం విశేషం.కేవలం ఓవర్‌డ్రాఫ్ట్ మాత్రమే కాకుండా, తాత్కాలిక నగదు కొరతను అధిగమించేందుకు తీసుకునే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ వినియోగం కూడా గణనీయంగా తగ్గిపోయింది. 2026 ఏప్రిల్ నెలలో 8 రోజుల పాటు సగటున రూ.1,996 కోట్ల చొప్పున డబ్ల్యూఎంఏ తీసుకోగా.. మే నెల నాటికి అది సగానికి సగం తగ్గి కేవలం 4 రోజులకు, సగటున రూ.466.25 కోట్లకు పరిమితమైంది. అలాగే ప్రభుత్వం తన వద్ద ఉన్న సెక్యూరిటీలను హామీగా ఉంచి తీసుకునే స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ కూడా ఏప్రిల్‌లో 25 రోజుల పాటు సగటున రూ. ?7,181 కోట్లు ఉండగా, మే నాటికి 21 రోజులకు, సగటు మొత్తం రూ.6,225.92 కోట్లకు తగ్గింది. ఆర్బీఐ సదుపాయాలపై ప్రభుత్వం క్రమంగా ఆధారాన్ని తగ్గించుకుంటూ వస్తోందనడానికి ఈ సంఖ్యలే నిదర్శనం.గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా చేసిన అప్పులు, అడ్డగోలు నిధుల మళ్లింపులతో రాష్ట్ర ఖజానా దివాళా అంచున నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆదాయ వనరులను సమర్థవంతంగా సమీకరించుకుంటూ, అనవసర ఖర్చులకు కళ్లెం వేస్తూ ఆర్థిక నిర్వహణను పకడ్బందీగా చేపట్టింది. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ ఖజానాను స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో ఆర్థిక శాఖ విజయం సాధించింది. ఓవర్‌డ్రాఫ్ట్ అనే పదం వినపడకుండా సొంత రాబడులతో రాష్ట్ర రథాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రస్తుత ఆర్థిక నిర్వహణే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతికి అసలైన వెన్నెముకగా నిలుస్తోంది.

## విశాఖలో మల్లారెడ్డి వర్శిటీ

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 30 పెన్ పవర్:** తెలంగాణలో బలమైన ఇంజనీరింగ్, మెడికల్ , ప్రైవేట్ విశ్వవిద్యాలయ వ్యవస్థను నిర్మించిన బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి.. ఇప్పుడు తన దృష్టిని ఆంధ్రప్రదేశ్ వైపు సారిస్తున్నారు. తెలంగాణలో మల్లా రెడ్డి యూనివర్సిటీ'తో పాటు డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదాతో విద్యా రంగాన్ని ఏలిన మల్లా రెడ్డి గ్రూప్, ఆంధ్రప్రదేశ్‌లో తన విద్యా వ్యాపారాన్ని అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఏపీలోని ప్రధాన నగరాలు, ఉమ్మడి జిల్లాలను లక్ష్యంగా చేసుకుని రీజినల్ క్యాంపస్‌లు, శాటిలైట్ క్యాంపస్‌లు , ఆఫ్-క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుకు మల్లా రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యం ప్రణాళికలను వేగవంతం చేసింది.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఏపీ ఐటీ, ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో మల్లా రెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఆఫ్-క్యాంపస్ పేరుతో భారీ ఆఫ్-క్యాంపస్ సెంటర్‌ను ఇప్పటికే ప్రారంభించారు. యూజీసీ అనుమతులతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ విభాగాల్లో అత్యాధునిక కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. విశాఖతో పాటు రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ, గుంటూరు బెల్ట్‌తో పాటు రాయలసీమ కేంద్రమైన తిరుపతి, కర్నూలు జిల్లాల్లోనూ కొత్త క్యాంపస్‌ల నిర్మాణానికి భూముల సేకరణ, అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో ఓ కాలేజీని కొని ఇప్పటికే ఆఫ్ క్యాంపస్ ను ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు ఇస్తున్న ప్రోత్సాహకాలు మల్లా రెడ్డి గ్రూప్‌కు కలిసివస్తున్నాయి. తెలంగాణకు చెందిన వేలాది మంది ఏపీ విద్యార్థులు ప్రతిఏటా మల్లా రెడ్డి విద్యాసంస్థల్లో చేరుతున్నందున నేరుగా ఏపీలోని స్థానిక ప్రాంతాల్లోనే నాణ్యమైన మౌలిక వసతులతో క్యాంపస్‌లను అందుబాటులోకి తెస్తే డిమాండ్ మరింత పెరుగుతుందని యాజమాన్యం అంచనా వేస్తోంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఎఐ , డేటా సైన్స్, పారామెడికల్ . లైఫ్ సైన్సెస్ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఏపీ విద్యార్థులను ఆకట్టుకునే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు.మల్లా రెడ్డి విద్యా సంస్థల ఈ అగ్రెసివ్ నెట్‌వర్క్ విస్తరణతో ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ ప్రైవేట్ కాలేజీలు , కార్పొరేట్ విద్యా సంస్థలకు గట్టి పోటీ ఎదురుకాబోతోంది. పొలిటికల్ ఇమేజ్, బ్రాండ్ మార్కెటింగ్, తక్కువ రుసుములతో కూడిన హామీలు, ప్లేస్‌మెంట్స్ నెట్‌వర్క్‌ను చూపించి ఏపీ ఉన్నత విద్యా మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని మల్లా రెడ్డి గ్రూప్ చూస్తోంది. రాబోయే రెండు మూడేళ్లలో ఏపీలోని ప్రధాన జిల్లాలన్నింటికీ తమ విద్యా నెట్‌వర్క్‌ను విస్తరించి, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తిరుగులేని విద్యా సామ్రాజ్యంగా ఎదగడమే లక్ష్యంగా మల్లా రెడ్డి తన ప్లాన్‌ను అమలు చేస్తున్నారు

# కల్కి 2'లో సుమతి పాత్ర ఏంటి?.. దీపిక ఎగ్జిట్‌తో మరింత ఆసక్తికరంగా మారిన కథ

ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కల్కి 2898-ఏడీ' సినిమాకు కొనసాగింపుగా రాబోతున్న 'కల్కి 2'పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. తొలి భాగంలో కీలకంగా నిలిచిన సుమతి పాత్ర సీక్వెల్‌లో ఎలా ఉండబోతోందన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ పాత్రను తొలి సినిమాలో దీపికా పదుకొణే పోషించగా.. ఆమె సీక్వెల్ నుంచి తప్పుకోవడంతో సుమతి పాత్ర భవితవ్యంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### సుమతి పాత్ర చుట్టూనే తొలి భాగం కథ

'కల్కి 2898-ఏడీ' కథలో సుమతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువు భవిష్యత్తులో కల్కి అవతారంగా మారుతాడనే అంశాన్ని కథలో కీలకంగా చూపించారు. దీంతో సుమతిని రక్షించేందుకు జరిగే ప్రయత్నాలు, ఆమెను వెంబడించే శక్తుల మధ్య సంఘర్షణ కథలో ప్రధాన అంశంగా నిలిచింది.



దీపికా పదుకొణే ఈ పాత్రలో నటించారు. అయితే 'కల్కి 2' నిర్మాణానికి సంబంధించిన విషయాల్లో ఆమె ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో సుమతి



పాత్రను కొనసాగించేందుకు మరో నటిని ఎంపిక చేస్తారా? లేక తొలి భాగంలోనే ఉన్న దృశ్యాలతో పాత్రను ముగిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కొత్త పాత్రలు ఉండవన్న దర్శకుడి వ్యాఖ్యలు

'కల్కి 2'లో కొత్తగా పెద్దగా కొత్త పాత్రలను పరిచయం చేయడం లేదని దర్శకుడు నాగ్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. తొలి భాగంలో పరిచయమైన పాత్రలే సీక్వెల్‌లోనూ కొనసాగుతాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. దీంతో సుమతి పాత్ర విషయంలో చిత్రబృందం ఎలాంటి నిర్ణయం తీసుకుందనే ఆసక్తి పెరిగింది. ఒకవేళ సుమతి పాత్రలో మరో నటిని తీసుకున్నా.. అది కొత్త పాత్ర కాకుండా ఇప్పటికే ఉన్న పాత్రకు కొనసాగింపుగానే పరిగణించే అవకాశం ఉంది.

### కథలో కీలక మలుపు ఉంటుందా?

దీపికా పదుకొణే తప్పుకోవడం నేపథ్యంలో సుమతి పాత్రను కథ ప్రారంభంలోనే ముగిస్తారా? లేక ఆమె కథను మరో మలుపుతో ముందుకు తీసుకెళ్తారా? అనే విషయంపై ప్రస్తుతం స్పష్టత లేదు. దీనిపై సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో వివిధ రకాల చర్చలు జరుగుతున్నాయి.

మరోవైపు 'కల్కి 2'లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కమల్ హాసన్ పాత్ర యాస్కిన్, అమితాబ్ బచ్చన్ పోషిస్తున్న అశ్వత్థామ పాత్రల మధ్య సంఘర్షణ మరింత కీలకంగా ఉండబోతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుమతి పాత్ర కథలో ఎంతవరకు కొనసాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

### థియేటర్లలోనే అసలు సమాధానం?

సినిమాకు సంబంధించిన కీలక కథాంశాలను చిత్రబృందం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సుమతి పాత్రకు సంబంధించిన విషయాల్లోనూ ఇప్పటివరకు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు. అందువల్ల ప్రస్తుతం వినిపిస్తున్న అంశాలను ఊహాగానాలుగానే చూడాలి.సుమతి పాత్రకు ఎలాంటి ముగింపు ఇస్తారు? ఆమె కథ 'కల్కి 2'లో ఏ మలుపు తీసుకుంటుంది? అనే ప్రశ్నలకు సినిమా విడుదలైన తర్వాతే స్పష్టమైన సమాధానం లభించే అవకాశం ఉంది. ఇప్పటికే 'కల్కి 2'పై ఉన్న అంచనాలకు ఈ అంశం మరింత ఆసక్తిని జోడిస్తోంది.



## వన్డేల్లో రోహిత్ శర్మ అరుదైన ఘనత.. 12 వేల పరుగుల క్లబ్‌లో హిట్‌మ్యాన్

ఈ ఘనత సాధించిన భారత మూడో క్రికెటర్‌గా రికార్డ్

వేగంగా ఈ మైలురాయి చేరిన రెండో ఆటగాడిగా హిట్‌మ్యాన్

సచిన్, కోహ్లీల తర్వాత ఈ క్లబ్‌లో చేరిన భారత బ్యాటర్

గౌహతిలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత



భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తన పేరిట మరో అరుదైన మైలురాయిని లిఖించుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 12,000 పరుగుల మార్కును అధిగమించాడు. గువాహటి బర్సపరా స్టేడియంలో వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన రెండో వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఈ అరుదైన క్లబ్‌లో చేరిన మూడో భారత బ్యాటర్‌గా, ప్రపంచవ్యాప్తంగా ఏడో ఆటగాడిగా నిలిచాడు.

రోహిత్ శర్మ కేవలం 282 ఇన్నింగ్స్‌లలోనే 12 వేల పరుగుల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. తద్వారా వన్డేల్లో అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న రెండో ఆటగాడిగా అతను రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (242 ఇన్నింగ్స్‌లు) అగ్రస్థానంలో ఉండగా, 300 ఇన్నింగ్స్‌లలో ఈ ఫీట్ సాధించిన సచిన్ టెండూల్కర్‌ను రోహిత్ అధిగమించాడు. భారత ఆటగాళ్లలో సచిన్, కోహ్లీ తర్వాత ఈ మైలురాయిని చేరిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. ప్రస్తుత మ్యాచ్‌లో అద్భుతమైన ఫామ్‌ను కనబరిచిన రోహిత్, అర్ధ సెంచరీతో రాణించాడు. తన కెరీర్‌లో ఇప్పటివరకు అతను 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక ఆటగాడిగా, అత్యధిక వ్యక్తిగత స్కోరు (264 నాటౌట్) సాధించిన బ్యాటర్‌గా రోహిత్ పేరిట అసాధారణ రికార్డులు ఉన్నాయి.

## హాకీలో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. కొరియాకు షాక్, గోల్డ్ కోసం చైనాతో పోరు!

జపాన్ వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో భారత మహిళల హాకీ జట్టు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్ పోరులో పటిష్టమైన దక్షిణ కొరియా జట్టును 2-0 గోల్స్ తేడాతో ఓడించి ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సలీమా టెటే నేతృత్వంలోని భారత వనితలు నేరుగా ఫైనల్‌లోకి ప్రవేశించడమే కాకుండా, స్వర్ణ పతకం కోసం చైనాతో తలపడేందుకు రెడీ అయ్యారు.

**ఇషికా గోల్‌తో వీడిన డెడ్‌లాక్.. అదరగొట్టిన ఇండియా:**

మొదటి మూడు క్వార్టర్ల పాటు ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో సౌత్ కొరియా డిఫెన్స్ చాలా పటిష్టంగా ఉండడంతో ఎలాంటి గోల్స్ నమోదు కాలేదు. కానీ మ్యాచ్ తారాస్థాయికి చేరుకున్న తరుణంలో.. 44వ నిమిషంలో టీమిండియా ప్లేయర్ ఇషికా అద్భుతమైన గోల్ సాధించి జట్టుకు గోల్స్ ఖాతా తెరిచింది. సుదీర్ఘంగా కొనసాగిన డెడ్‌లాక్‌ను బ్రేక్ చేసిన ఈ గోల్ మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది.

**కెప్టెన్ సలీమా టెటే సూపర్ రన్.. భారత్ డబుల్ లీడ్:**

ఇక ఆ తరువాత నాలుగో, చివరి క్వార్టర్‌లో భారత జట్టు మరింత దూకుడు పెంచింది. జట్టు కెప్టెన్ సలీమా టెటే మిడ్-ఫీల్డ్ నుంచి ఎంతో చాకచక్యంగా డ్రిబ్లింగ్ చేస్తూ కొరియా షూటింగ్ సర్కిల్‌లోకి మెరుపు వేగంతో దూసుకెళ్లింది. ఆమె సృష్టించిన అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇండియా ఆధిక్యాన్ని 2-0కి పెంచారు. చివరి వరకు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు.

**స్వర్ణ పతక పోరులో చైనాతో ఢీ:**

ఈ సెమీఫైనల్ విజయంతో ఆసియా క్రీడల ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టు, పసిడి పతకం కోసం చైనా జట్టుతో తలపడనుంది. గ్రూప్ దశ నుంచి అజేయంగా దూసుకొస్తున్న ఇండియన్ హాకీ అమ్మాయిలు, ఫైనల్‌లోనూ అదే జోరును కొనసాగించి దేశానికి స్వర్ణ పతకం అందించాలని కోట్లాది మంది భారతీయులు కోరుకుంటున్నారు.




Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965